

కనిగిరిలో ఆటోను నడుపుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభం సందర్భంగా జిల్లావ్యాప్తంగా కోలాహలంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఆటోలతో ర్యాలీలు చేపట్టారు. ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి మినీస్టేడియం వరకు భారీ ఆటో ర్యాలీ జరగ్గా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వయంగా ఆటోను నడిపారు. అందులో మంత్రి ఆనం, ఎంపీ మాగుంట కూర్చొని ఉత్సాహపరిచారు. అనంతరం మినీ స్టేడియంలో నిర్వహించిన సభలో వారు పాల్గొన్నారు. జిల్లాలో 11,356 మంది లబ్ధిదారులకు రూ.17.03కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించి నమూనా చెక్కును ఆటో డ్రైవర్ల సంఘం ప్రతినిధులకు అందజేశారు.



ఆటో డ్రైవర్లకు నమూనా చెక్కును అందజేస్తున్న ఇన్‌చార్జి మంత్రి ఆనం, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్ తదితరులు



ఎర్రగొండపాలెంలో ఆటోల ర్యాలీలో పాల్గొన్న టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ, టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, నేతలు



ఒంగోలులో ఆటోను నడుపుతున్న ఎమ్మెల్యే దామచర్ల, లోపల కూర్చొన్న మంత్రి ఆనం, ఎంపీ మాగుంట, మేయర్ సుజాత

కోలాహలంగా..

- ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభం
- జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా ఆటోవాలాల ర్యాలీలు, పలుచోట్ల సభలు
- ఒంగోలులో పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి ఆనం, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్
- ఇతర చోట్ల ముఖ్య నేతలు హాజరు
- సీఎం చంద్రబాబు ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం



నగదు జమ అయినట్లు వచ్చిన మెసేజ్‌ను చూసుకుంటున్న ఆటో డ్రైవర్



గిద్దలూరులో ఆటోను నడుపుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఒంగోలు, అక్టోబరు. 4 (ఆంధ్రజ్యోతి) : 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం జిల్లావ్యాప్తంగా శనివారం సందడిగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఆటో డ్రైవర్లు ర్యాలీలు చేపట్టారు. పథకం కింద ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.15వేల చొప్పున రాష్ట్రప్రభుత్వం శనివారం వారి ఖాతాలలో జమ చేసింది. విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాలకు ప్రభుత్వం ఆ నిధులను జమచేస్తున్నప్పటికీ స్థానికంగా ఎక్కడికక్కడ సభలు, సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. విజయవాడలో సీఎం పాల్గొన్న సభను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే ఏర్పాట్లను రవాణా శాఖ ఆధ్వర్యంలో చేశారు. జిల్లాలోని ప్రధాన కేంద్రాలలో ఈ సందర్భంగా ఆటోలతో భారీ ర్యాలీలు నిర్వహించారు. పలుచోట్ల నేతలు, అధికారులు ఖాకీ చొక్కాలు ధరించి పాల్గొన్నారు. ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లు పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి మినీ స్టేడియం వరకు భారీ ఆటో ర్యాలీ జరగ్గా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వయంగా ఆటోను నడిపారు. అందులో మంత్రి ఆనం, ఎంపీ మాగుంట కూర్చొని ర్యాలీలో పాల్గొన్న వారిని ఉత్సాహపరిచారు. అనంతరం మినీస్టేడియంలో సభను నిర్వహించగా జిల్లాలో ఈ పథకం కింద 11,356 మంది లబ్ధిదారులకు రూ.17.03కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించి అందుకు సంబంధించిన చెక్‌ను ఆటోడ్రైవర్ల సంఘం ప్రతినిధులకు అందజేశారు. మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. గిద్దలూరులో జరిగిన ర్యాలీలో అక్కడి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి భాగస్వాములయ్యారు. ఆయన స్వయంగా ఆటో నడిపారు. కనిగిరిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు. అలాగే దర్శిలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితోపాటు డీసీసీబీ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు భాగస్వాములయ్యారు. వైపాలెంలో జరిగిన ర్యాలీలో అక్కడి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీలు పాల్గొన్నారు



ఆటో డ్రైవర్ ఖాతాలో నగదు జమ అయినట్లు వచ్చిన సెల్‌ఫోన్ మెసేజ్‌ను చూపుతున్న టీడీపీ దర్శి ఇన్‌చార్జి లక్ష్మి



మార్కాపురంలో నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి



ఫ్యాక్టరీలో నిలిచిపోయిన కటింగ్ మిషన్లు

చర్చలు విఫలం

- గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల ప్రతిపాదనలకు ఏఎంఆర్ మౌనం
- సమ్మె కొనసాగింపునకు పరిశ్రమల నిర్వాహకుల నిర్ణయం
- రాయి రవాణా చేసే ట్రాలీ ఓనర్ల సంఘీభావం

చీమకుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు, గనుల సీనరేజీ వసూలు హక్కు పొందిన ఏఎంఆర్ సంస్థల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో సమ్మె కొనసాగించాలని ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నిర్ణయించింది. ఇరుపక్షాల వారు ఒంగోలులో శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ యజమానుల సంఘ నాయకులు ప్రధానంగా మూడు ప్రతిపాదనలను ఏఎంఆర్ సంస్థ ముందుంచారు. ఎండీ ఎల్ (మైనింగ్ డీలర్ లైసెన్స్) పొందిన ఫ్యాక్టరీ యజమానుల్లో శ్లాబ్ పద్ధతిలోకి ప్రవేశించిన వారు చెల్లించే రాయల్టీని ప్రభుత్వం కట్టర్‌కు రూ.27వేల నుంచి 35 వేలకు పెంచి అక్టోబర్ నుంచి అమలు చేసిందన్నారు. దీనిని చెల్లించేందుకు తమకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. అయితే ఈ చెల్లింపునకు గాను తమకు నెలకు 22క్యూబిక్ మీటర్ల రాయి కొనుగోలుకు ఇస్తున్న అనుమతులు ప్రతినెలా రాయి లభ్యంకాని పక్షంలో తదుపరి నెలకు క్యారీ ఫార్వర్డ్ చేయాలని కోరారు. దీంతోపాటు ముడిరాయి కొనుగోలు సమయంలో కొలతలు తీయకుండా ప్రాసెసింగ్ తర్వాత శ్లాబులపై లెక్కతీసి అనుమతికి మించితే జరిమానాలు విధించాలన్నారు. ప్రస్తుతం క్యూబిక్ మీటర్ రాయి కటింగ్ మరియు పాలిషింగ్ చేసిన తర్వాత వచ్చే శ్లాబుల విక్రయాల సమయంలో 350 అడుగుల మేరకు మాత్రమే అనుమతి ఇస్తున్నారన్నారు. దీనిని 450 అడుగులకు పెంచడానికి అనుమతులు అధికారికంగా మంజూరు చేయాలని కోరారు. అంతకు మించి ఎక్కువ ఉంటేనే జరిమానా విధించాలన్న మూడో ప్రతిపాదనను ఓనర్ల అసోసియేషన్.. ఏఎంఆర్ సంస్థ ముందుంచింది. మీరు ఆశిస్తున్నట్లు, ప్రభుత్వం విధించిన రేటుకు భిన్నంగా అదనంగా కట్టర్‌కు ఇంతని రేటు కట్టి ఇచ్చే పరిస్థితి లేదని తేల్చిచెప్పింది. ఈ ప్రతిపాదనలకు ఏఎంఆర్ సంస్థ తరఫున హాజరైన నిహాన్ ఎటువంటి హామీ ఇవ్వలేదు. మీ ప్రతిపాదనను సంస్థ యజమాని దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. దీంతో చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. ప్రభుత్వంతో ఏఎంఆర్ ఒప్పందం కుదిరిన తర్వాత మళ్లీ ఇరుపక్షాలు భేటీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. చర్చల్లో క్వారీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు ఆర్.పి.రవి, చలువాది బదరీనారాయణ, భాస్కర్‌రెడ్డి, ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, యర్రగుంట్ల శ్రీనివాసరావు, కోడూరి వెంకట్రావు, మార్బెల్ బుజ్జీ, క్రిస్టిపాటి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల సమ్మెకు రాళ్లను రవాణా చేసే ట్రాలీ యజమానుల సంఘ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

వైసీపీ రౌడీయిజం...!

చెరువుకొమ్ముపాలెంలో అభివృద్ధి పనుల అడ్డగింత

- పనులు చేస్తున్న వారికి, అధికారులకు బెదిరింపులు
- కాలువ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌పై ఎక్కి మరీ వీరంగం
- అభివృద్ధిని ఓర్వలేక టీడీపీ నేతలపై అసత్య ప్రచారం



ఎక్స్‌కవేటర్‌పైకి ఎక్కి రుబాబు చేస్తున్న వైసీపీ నాయకుడు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమం కోసం గ్రామ అభివృద్ధికి చేపట్టిన పనులను వైసీపీకి చెందిన రౌడీషీటర్ ఓర్వలేకపోయాడు. డ్రెయిన్‌ల నిర్మాణ పనులను అడ్డుకున్నాడు. పనులు చేపడుతున్న అధికారులు, కాంట్రాక్టర్‌లను బెదిరించడంతోపాటు దుర్భాషలాడాడు. చివరికి పోలీసుల జోక్యంతో పనులు పునఃప్రారంభమయ్యాయి. నగర పరిధిలోని 18వ డివిజన్‌లో ఉన్న చెరువుకొమ్ము పాలెంలో ఇటీవల ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చెరువుకొమ్ముపాలెంలో దీర్ఘకాలంగా మురుగు కాలువ సమస్య నెలకొంది. అనేక ఏళ్ల క్రితం కొన్ని ప్రాంతాల్లో నిర్మించిన కాలువలు శిథిలమయ్యాయి. మరికొన్ని చోట్ల అసలు డ్రైనేజీ సౌకర్యం లేక ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతోంది. ఈనేపథ్యంలో ప్రజల విజ్ఞప్తులు, టీడీపీ నేతల చొరవతో గ్రామంలో డ్రెయిన్ నిర్మాణానికి రూ.40లక్షలు, కొత్త ఎస్సీ కాలనీకి మరో రూ.40లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం గ్రామంలో కార్పొరేషన్ అధికారులు పనులు చేస్తున్నారు. కొత్త ఎస్సీ కాలనీలో త్వరలో ప్రారంభంకానున్నాయి. గ్రామంలో చేస్తున్న పనులకు వైసీపీ నాయకుడు అనేక విధాల ఆటంకం కల్గిస్తున్నాడు. తన ఇంటి వద్ద స్థలానికి ఆనుకొని కాలువ నిర్మిస్తుండగా అడ్డుగా ఉన్న రెండు చిన్న చెట్లను తొలిగించేందుకు కూడా ససేమిరా అన్నాడు. పనులు చేసే కూలీలను బెదిరించాడు. దీంతో వాటిని అలాగే ఉంచి కాలువను నిర్మించారు. అక్కడి నుంచి కొద్దిగా ముందుకు వెళ్లిన తర్వాత పాత కాలువ స్థానంలో కొత్తది నిర్మించేందుకు అధికారులు ప్రయత్నించగా పదేపదే అడ్డుకున్నాడు. కాలువను తవ్వేందుకు వచ్చిన ఎక్స్‌కవేటర్‌పైకి ఎక్కి వీరంగం చేశాడు. దీంతో కొద్దిరోజులు డ్రెయిన్ పనులకు ఆటంకం కలిగింది. అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని కొందరు గ్రామస్థులు ప్రశ్నించడంతో మరింత రెచ్చిపోయిన సదరు రౌడీషీటర్ ఎదురుదాడికి దిగాడు. నానా హంగామా సృష్టించాడు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని పనులు కొనసాగించేలా చర్యలు చేపట్టారు.

పోలీసు రికార్డుల్లోనూ 'పేరుంది'

తన రాజకీయ పలుకుబడి, బెదిరింపు ధోరణితో గ్రామంలో అన్నింటికీ ఆటకంగా మారిన ఆ నాయకుడి పేరు పోలీసు రికార్డుల్లోనూ ఉంది. గ్రామంలో పలువురిపై దాడికి దిగడం, బెదిరింపులకు పాల్పడటంపై ఆయనపై గతంలో పలు కేసులు నమోదయ్యాయి. దీంతో ఆ వైసీపీ నేతపై పోలీసులు రౌడీషీట్ తెరిచారు. అయినప్పటికీ అతను ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ప్రజాప్రభుత్వంలోనూ చెలరేగిపోతున్నాడు. టీడీపీ నాయకులపై నిందలు మోపుతున్నాడు. ప్రజాప్రతినిధులపైనా నోరుపారేసుకుంటున్నాడు. గ్రామ అభివృద్ధి కోసం ఏ పనులు చేపట్టినా అడ్డుకోవడం ఆ రౌడీషీటర్‌కు అలవాటుగా మారిందని, దీనిపై అటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇటు పోలీసులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సొంతంగా కాలువ నిర్మాణం.. వైసీపీ పాలనలో కార్పొరేషన్ నుంచి బిల్లులు!

గ్రామంలో అభివృద్ధి అంటేనే ఓర్వలేని ఆ వైసీపీ నాయకుడు గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రామానికి చివరన 60మీటర్ల వరకూ కాలువను పొడిగించాడు. తానేదో సొంతంగా పనులు చేసినట్లు, గ్రామానికి ఏదో ఉద్ధరిస్తున్నట్లు చెప్పుకున్నాడు. వాస్తవానికి కాలువ నిర్మాణం చేపట్టాలంటే 2.5 అడుగుల ఇన్నర్ బెడ్, 3 అడుగుల ఎత్తులో వాల్ కట్టాల్సి ఉంది. అయితే తన పలుకుబడితో నిర్మించిన కాలువ కనీసం 1.5 అడుగులు కూడా లేకపోగా అధికారులకు తెలియకుండా, ఎలాంటి టెండర్ లేకుండా నిర్మించాడు. ఈ కాలువకు ఏకంగా కార్పొరేషన్ నుంచి బిల్లులు డ్రా చేసుకున్న ఘనుడు సదరు రౌడీషీటర్. ఇలాంటి వ్యక్తి ప్రస్తుత ప్రజాప్రభుత్వం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను అడ్డుకోవడం, అసత్య ప్రచారాలు చేయడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం కొత్త కాలువ నిర్మాణం చేపట్టి బెడ్ వేసిన తర్వాత వర్షాలకు ఒకరి ఇంటికి సంబంధించిన పాత ప్రహరీ గోడ కూలిపోయింది. అయితే కాలువ కోసం తవ్వడం వల్లనే గోడ కూలిందంటూ తన అక్కసును వెళ్లగక్కుతున్నాడు. ఆ ప్రహరీ యజమాని మాత్రం అది కాలువ తవ్వడం వలన కాదని, వర్షానికి కూలిపోయిందని చెప్పడం గమనార్హం. అలాగే గ్రామంలోని పాత కాలువ స్థానంలోనే కొత్తది నిర్మిస్తున్నారు. గతంలో ఉన్నస్థానాన్ని మార్చకుండా పనులు చేస్తున్నారు. కానీ సాగునీటి చెరువుకు కాలువ నుంచి వచ్చే నీరు మళ్లిస్తున్నట్లు సదరు రౌడీషీటర్ అసత్య ప్రచారం చేస్తున్నాడు.

కొత్త టీచర్ల నియామకాలకు కసరత్తు

కమిషనర్ కార్యాలయానికి ఐటీ బృందం

ఒంగోలు విద్య, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో పోస్టులకు ఎంపికైన కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. 623 మంది కొత్త టీచర్లకు స్థానాలు కేటాయించాల్సి ఉంది. ఖాళీలను ధ్రువీకరించేందుకు రెండు రోజుల క్రితం ఉపవిద్యాధికారులు, మండల



విద్యాధికారులతో సమావేశం నిర్వహించి కసరత్తును పూర్తిచేశారు. శనివారం సాయంత్రం మళ్లీ మరోసారి ఎంఈవోలను ఫోన్ ద్వారా సంప్రదించి ఖాళీలను మళ్లీ ధ్రువీకరించుకున్నారు. జిల్లాలోని టీచర్ పోస్టుల ఖాళీల జాబితాలతో డీఈవో కార్యాలయం ఐటీ సెల్ సిబ్బంది సోమవారం మంగళగిరిలోని పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయానికి రావాలని శనివారం పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ సుబ్బారెడ్డి ఆదేశించారు.

34 మంది టీచర్లకు నియామక ఉత్తర్వులు

ఒంగోలు విద్య, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : బదిలీపై ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు వచ్చిన 34 మంది టీచర్లకు శుక్రవారం అర్ధరాత్రి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర జిల్లాల నుంచి 21 మంది పరస్పర బదిలీల్లో, 13 మంది స్పౌజ్ కేటగిరీల్లో ఇక్కడికి వచ్చారు. వీరికి శుక్రవారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. 3వ కేటగిరీ పాఠశాలల్లోని ఖాళీలన్నింటినీ చూపించారు. ఇతర జిల్లాల్లో ఏ యాజమాన్యంలో పనిచేస్తూ ఇక్కడికి వచ్చారో వారికి ఇక్కడ కూడా అదే యాజమాన్యానికి నియామకపు ఉత్తర్వులు ఇచ్చారు. స్పౌజ్ కేటగిరీలో ఇక్కడకు వచ్చిన వారికి వారి స్పౌజ్ పనిచేస్తున్న స్థానానికి సమీపంలోని ఖాళీలను కేటాయించారు. కౌన్సెలింగ్‌లో టీచర్లు ఆప్షన్లు చూసి వారు కోరుకునే సమయానికి రాత్రి పొద్దుపోయింది.

కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన

చలో విజయవాడకు తరలిన వైద్యాధికారులు



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల సమ్మె జిల్లాలో కొనసాగుతోంది. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలోని 64 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న 138 మంది వైద్యాధికారులు ఆందోళనబాట పట్టారు. గతనెల 26న సమ్మె నోటీసు ఇచ్చిన అసోసియేషన్ నాయకులు 27వ తేదీ నుంచి ఆందోళన చేపట్టారు. అయితే వైద్యశాఖ ఉన్నతాధికారులు ఆయా సమస్యలపై పలు పర్యాయాలు చర్చలు జరిపినా విఫలమయ్యాయి. వైద్యాధికారులు సమ్మె చేపట్టేందుకే నిర్ణయించారు. అందులోభాగంగా శనివారం చలో విజయవాడ పేరుతో నిర్వహించిన ధర్నాకు జిల్లా నుంచి అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు తరలివెళ్లారు. అక్కడ ధర్నాలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని నినదించారు.

వెనుకబడిన ప్రాంతం .. ఉద్యోగాల్లో ప్రథమం

- జిల్లాలో 661 మందికి టీచర్లుగా కొలువు
- అందులో వైపాలెం నియోజకవర్గం నుంచే 94 మంది
- వారిలో పేదవర్గాల పిల్లలే అధికం

7

ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఫిబ్రవరి 23 నుంచి నెల రోజులు నిర్వహణ

7

ఉపయోగం లేని రైలు పొడిగింపు

చెన్నైకి కోరితే ధర్మవరం ఇవ్వడంపై ప్రజల పెదవి విరుపు

సూపర్ జీఎస్టీతో తగ్గిన సూర్యఘర్ పథకం ధరలు

అడిగేవారు లేరు..అడ్డంగా కట్టేయ్..!

● రోడ్డు ఆక్రమించి షాపు నిర్మాణం



రోడ్డును ఆక్రమించి నిర్మించిన షెడ్డు

ఒంగోలు నగరంలో రోడ్‌సైడ్ అక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం ఆక్రమణదారులకు మరింత కలిసి వస్తోంది. స్థానిక దేవుడుచెరువు పార్కు ఎదురు మెయిన్ రోడ్‌లో రాత్రికి రాత్రే ఓ షెడ్డును నిర్మించేశారు. నాలుగు రోడ్‌ల జంక్షన్ మూలమలుపులో షెడ్డు వేయడంతో రాత్రి వేళలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి రోడ్‌సైడ్ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంతోపాటు, అనధికారకంగా నిర్మించిన షెడ్డను తొలగించాలని పలువురు కోరుతున్నారు

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలు

● ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ



ఆటో డ్రైవర్లకు చెక్కును పంపిణీ చేస్తున్న బాలాజీ, ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆటో డ్రైవర్లకు అండగా ఉండేలా శనివారం రూ.15వేలు జమ చేసిన సందర్భంగా శనివారం ఎర్రగొండపాలెంలో ర్యాలీని ప్రారంభించి అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. ఎన్నికల హామీలో లేనప్పటికీ ఆటోవాలాలకు అండగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ పథకం ప్రారంభించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఆటోడ్రైవర్ల సేవా పథకం కింద 1073 మంది ఆటో డ్రైవర్ల రూ.1,60,95000 జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు, నియోజకవర్గ టీడీపీ నాయకులు, నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లు ఆటోలతో ర్యాలీలో పాల్గొని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిదండ్రులకు చిన్నారుల అప్పగింత

తాళ్లూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కూలి పనుల ఒప్పందం ముగిసినా పిల్లలను ఇంటికి పంపక పోవటంతో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరావు చొరవతో తల్లిదండ్రులకు అప్పగించారు. దారంవారిపాలెంకు చెందిన నాగులూరి పౌలు, సుభాషిణిలకు సంతానం ఎక్కువగా ఉండి పోషణ కష్టంగా ఉండటంతో తమ ఇద్దరు పిల్లలను నెల్లూరు జిల్లా తెట్టు గ్రామానికి చెందిన బాతుల పెంపకం యజమాని ప్రసాద్ వద్దకు పనికి వదిలిపెట్టారు. ఈ సందర్భంగా యజమాని వద్ద కొంత అప్పుగా తీసుకున్నారు. బాకీ తీరినా పిల్లలను పంపకుండా ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని కోటేశ్వరరావు ఇండియన్ లేబర్ లైన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఇండియన్ లేబర్ లైన్ విచారణలో ఇద్దరు పిల్లలను కాకినాడ ప్రాంతంలో నిర్బంధించారని తెలుసుకుని కాకినాడ సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే పిల్లలను గుర్తించిపోలీస్ శాఖకు అప్పగించాలని ఆదేశించారు. పోలీస్ యంత్రాంగం కాకినాడ ప్రాంతంలో ఉన్న ఇద్దరు చిన్నారులను తెట్టు వద్ద ఉన్న తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆధారాల సేకరణ

ముండ్లమూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పసుపుగల్లులో మారం కోటిరెడ్డి ఇంట్లో గుర్తు తెలియని దొంగలు తలుపులు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. శనివారం ఒంగోలు క్లూస్‌టీమ్ సీఐ రవీంద్రారెడ్డి, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దుండగులు పగులకొట్టిన బీరువాను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఎస్‌ఐ కె.కమలాకర్ పాల్గొన్నారు.

రేపు వాహనాలకు వేలం

మార్కాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. ఎక్సైజ్ నేరాలలో స్వాధీనం చేసుకున్న మూడు వాహనాలకు వేలంపాట జరుగుతుందని, ఆసక్తిగలవారు పాల్గొనాలని సీఐ కోరారు.

కనులపండువగా అమ్మవారి ఊరేగింపు



నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంభం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేసే దసరా నవరాత్రి ఉత్సవాలు కంభంలో శుక్రవారం రాత్రి అర్ధరాత్రి 12.30గంటలకు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దిని అలంకారంలో సింహవాహనంపై ఊరేగుతూ పట్టణ పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం శనివారం ఉదయం 11.30గంటలకు ముగిసింది. ఈ గ్రామోత్సవంలో అమ్మవారు ఊరేగింపులో అగ్రభాగాన త్యాగరాజు మ్యూజికల్ బ్యాండ్, ఆర్కెస్ట్రా, లోకల్ బ్యాండ్ సెట్, కేరళ సింగారి మేళం, నరసరావుపేట కనకతప్పెట్లు, గంగాభవాని వెరైటీ డ్రమ్స్, తెలంగాణ బోనాల హంస వాహనం, లైటింగ్ ప్రభ, పులి బండ్లు, గజవాహనాల విన్యాసాలు అలరించాయి. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల నుంచే కాగా ఇతర ప్రాంతాల నుంచి కూడావేలాది మంది భక్తులు తరలి వచ్చారు. పుర వీధులలో ఊరేగింపుకు వచ్చిన అమ్మవారికి భక్తులు కాయకర్పూరాలు సమర్పించారు. కంభంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేసే దసరా పండుగ చివరి రోజు గ్రామోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మార్కాపురం డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో నలుగురు సీఐ, 10మంది ఎస్సైలు, 25మంది హెడ్ కానిస్టేబుళ్లు, 300మంది కానిస్టేబుళ్లు, 200మంది హోంగార్డులు, 50మంది రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

పోలీస్ ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

● డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్

కనిగిరి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు పోలీసుల ఆంక్షలు, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. శనివారం కనిగిరి డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాలతో డ్రైవింగ్ నిబంధనలు అతిక్రమించిన వారికి వివిధరకాల జరిమానాలు తెలియజేస్తూ శనివారం పట్టణంలో పోలీసు వాహనంలో, ఆటోల్లో ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి, ట్రిపుల్ రైడింగ్‌కు, అధిక స్పీడుకు రూ.1000 జరిమానా విధిస్తున్నట్లు చెప్పారు. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10వేలు, మైనర్‌లు డ్రైవింగ్ చేస్తే రూ.25 వేలు వారికి, వారి తల్లిదండ్రులకు జైలుశిక్ష, జరిమానా విధించనున్నట్లు తెలిపారు. వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోయినా, రిజిస్ట్రేషన్, లైసెన్స్ రెన్యూవల్ లేకపోయినా పోలీసులు విధించిన జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

● నియోజకవర్గ పరిశీలకులు స్వాములు



ఆటోడ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న స్వాములు, టీడీపీ నాయకులు

సింగరాయకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కొండపి నియోజవర్గ పరిశీలకుడు అడకా స్వాములు పేర్కొన్నారు. సింగరాయకొండలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లో శనివారం నిర్వహించిన 'ఆటోడ్రైవర్ల సేవలో' నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత పాకల రోడ్డు వద్ద నుంచి కందుకూరు రోడ్డు కూడలి వరకూ ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వర్గీయ ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు కూటమి పార్టీల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో స్వాములుతోపాటు పలువురు నేతలు మాటాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినప్పటికీ ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి ఏటా రూ.15వేల చొప్పున ఆర్థికసాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమం పేరిట రూ.1 ఇచ్చి ప్రజల నుంచి రూ.5 వసూలు చేశారని ధ్వజమెత్తారు. అనంతరం నియోజకవర్గంలోని 1,161 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కర్ణా తిరుపతమ్మ, గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కనపర్తి మనోజ్‌కుమార్, టీడీపీ మండలాల అధ్యక్షులు మించల బ్రహ్మయ్య, పోకూరి రవీంద్రబాబు, కొల్లపాటి వసంతరాయుడు, శ్రీనివాసరెడ్డి, టీడీపీ నేతలు షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, చీమకుర్తి కృష్ణ, ముళ్లపూడి సత్యనారాయణ, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్, ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ రాజేష్, ఆరు మండలాల అధికారులు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయడంతో పాటు వర్జీనియా పొగాకు లోగ్రేడ్‌ను క్వింటా రూ.20వేలకు తగ్గకుండా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. బర్లీ పొగాకు ఇంకా 30శాతానికిపైగా రైతుల వద్దనే నిల్వ ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పూర్తిగా కొనుగోళ్ళు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వర్జీనియా పొగాకు నెంబర్ పొగాకు ధరలు కొద్దిగా ధరలు పెరిగినట్లు కనిపించినా మరలా పూర్తిగా ధరలు తగ్గిపోయాయన్నారు. లోగ్రేడ్ కొనుగోళ్ళు లేనికారణంగా రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఈ ఏడాది రైతులు బ్యారన్‌కు రూ.4లక్షలకు పైగానే నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మరోపక్క శనగలకు ధరలు లేక రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ పెట్టుకొని తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ శనగలు క్వింటా రూ.10వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలన్నారు. అందుకోసం ఈనెల 6వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వెలిగొండప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలంటూ తీర్మానం చేవారు. జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెంట్యాల హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, బెజవాడ శ్రీనివాసరావు, ఎస్‌కే.బాబు, ఊస వెంకటేశ్వర్లు, కె.సుబ్బారావు, తిరుపతిరెడ్డి, రత్నారెడ్డి, టి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కుల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జనగణనతోపాటుగా కులగణన కూడా చేపట్టాలన్నారు. కులాల జనాభా ప్రాతిపదికన వారికి సంక్రమించాల్సిన హక్కులు కేటాయించాలని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కులప్రాతిపదికన రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలలో 143 కులాలు ఉన్నా వాటిలో ఎక్కు భాగం కులాలు ఇప్పటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీల కన్నా హీనమైన జీవితాలను అనుభవిస్తున్నారన్నారు. కులాల్లోని ఆధిపత్య వర్గం మాత్రమే పదవులు అనుభవిస్తున్నాయే తప్ప మిగిలిన కులాల వారు నేటికి అంటరాని వారిగా మిగిలిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు మాట్లాడుతూ జనగణనతో పాటు కులగణన జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బొట్లా సుబ్బారావు, తన్నీరు శివప్రసాద్, వెంకటేశ్వర్లు, పి.సుధాకర్, ఎల్.రాజశేఖర్, సుబ్బారావు, బేగ్, ఆర్.వెంకట్రావు, కరవది సుబ్బారావు, కె.వీరారెడ్డి, కృష్ణగౌడ్, సయ్యద్‌యాసిన్, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆర్.రామకృష్ణ, నల్లూరి మురళీ, ఎం.విజయ, డి.శ్రీనివాస్, మౌలాలి, ప్రభాకర్, లక్ష్మీ, రామయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం కులగణనపై తీర్మానం చేసి గవర్నర్ ద్వారా పార్లమెంట్‌కు పంపేలా చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా ఆమోదించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీలు

● పాల్గొన్న నాయకులు, అధికారులు



పొన్నలూరులో జీఎస్టీపై ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

పొన్నలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కల్పిస్తూ మండల కేంద్రమైన పొన్నలూరులో శనివారం ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌లో భాగంగా గతంలో వ్యవసాయ యంత్ర పరికరాలపై 12శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి ప్రభుత్వం కుదించిందన్నారు. దీని వలన రైతులపై భారం తగ్గుతుందన్నారు. మండల వ్యవసాధియారి వడ్డే రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, తహసీల్దార్ వి.పుల్లారావు, ఎంపీడీవో డాక్టర్ సుజాత, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, సీనియర్ నాయకుడు కర్ణ కోటిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వడ్డే మాల్యాద్రి, కోటేశ్వరరావు, రావూరి కోటేశ్వరమ్మ, ఉన్నం శ్రీనివాసరావు, తానికొండ మహేంద్ర, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో మానవహారం

టంగుటూరు (కొండపి): జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌తో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఏవో యుగంధర్‌రెడ్డి అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం టంగుటూరులో వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఒంగోలు రోడ్డులో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామని విజయ్‌కుమార్, ఎర్రమోసు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొండపి మండలంలోని వెన్నూరు గ్రామంలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై రైతులకు ఏవో మాల్యాద్రి శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో కుమార్, వీఏఏలు లింగారావు, జ్యోత్స్న పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం : లక్ష్మి



ఆటో నడుపుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పీడీసీసీబీ చైర్మన్ సీతారామయ్య

దర్శి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు అన్నివిధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రూ.15వేలు చొప్పున శనివారం వారి అకౌంట్‌లలో వేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా దర్శి ఆర్టీవో కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ లక్ష్మి స్వయంగా ఆటో నడిపారు. అనంతరం కాలేజీలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలుచేస్తుందని చెప్పారు. సూపర్‌సిక్స్ పథకాలను సూపర్ సక్సెస్ చేసిన ప్రభుత్వం తాజాగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చినట్టు చెప్పారు. దర్శి నియోజకవర్గంలో 1089 మంది డ్రైవర్లకు రూ.1,63,35000 నగదు జమ చేసినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో అన్నివర్గాల ప్రజలకు మేలు చేసిందన్నారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో పి. కల్పన, మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లోని నిందితులకు కౌన్సెలింగ్

ఒంగోలు క్రైం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి వినియోగదారులతోపాటు విక్రేతలకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు శనివారం ఒంగోలు నగరంలో 46 మంది వినియోగదారులు, 9 మంది విక్రేతలకు ఈగల్ టీమ్ సీఐ యు.సుధాకర్ నేతృత్వంలో బృందాలుగా ఏర్పడి కౌన్సెలింగ్ ఇచ్చారు. పాత నేరస్థుల నివాస ప్రాంతాలు, పని ప్రదేశాలకు వెళ్లి గంజాయి, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు గురించి వివరించారు. నగరంలోని గంజాయి వినియోగిస్తున్న 46 మందిని కేశవరాజు కుంట, కమ్మపాలెం, ఇందిరమ్మకాలనీ, మామిడిపాలెం, గోపాల్‌నగరం, మంగమూరు రోడ్, భారత్‌కాలనీ, నెహ్రూనగర్, వెంకటేశ్వరకాలనీ, త్రోవగుంట, దిబ్బలరోడ్డు ఇతర ప్రాతాలో ఉన్న వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అదేవిధంగా గంజాయి విక్రయాలు చేసే పాత నేరస్థులు మామిడిపాలెం, శివప్రసాద్‌కాలనీ, గాంధీనగర్, మదర్‌తెరిసా కాలనీ, పేర్నమిట్ట, వెంకటేశ్వర కాలనీ, ఆర్టీవో కార్యాలయం ప్రాంతాలలో ఉన్న 9మందికి కౌన్సెలింగ్ నిర్వహించి గంజాయి విక్రయం చట్టరిత్యానేరమని చెప్పారు. గంజాయి సమాచారం తెలిసిన వారు వెంటనే సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్ లేదా 112 నంబర్‌కు డయల్ చేయాలని పోలీసులు వారిని కోరారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.315

ఒంగోలు(రూరల్), అక్టోబరు4ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2లో శనివారం జరిగిన వేలంలో పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.315లు పలికింది. కనిష్ఠ ధర లోగ్రేడ్ కిలో రూ.79 పలికింది. మొత్తం బేళ్లు 1,333 రాగా 1,164 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 107 బేళ్లు నోబిడ్ అయ్యాయి.

కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించాలి

ఒంగోలు విద్య, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరణ చేపట్టి న్యాయం చేయాలని కాంట్రాక్టు అధ్యాపకుల రాష్ట్ర జేఏసీ చైర్మన్ కుమ్మరగుంట సురేష్ కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. యాక్టు 30 ప్రకారం జీవో 114 జారీ చేసి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీనిమేరకు కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరణ జరుగుతున్న సమయంలోనే ఎన్నికలు రావడంతో అప్పట్లో ఆ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ఆగిపోయిన సర్వీసు క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్ సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన వారిని అరెస్టు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్. అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని హెచ్‌సీఎం కళాశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో దళిత నేత నాగేంద్రరావు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడం దారుణమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పిల్లి మాల్యాద్రి, ఏలూరి శ్రీనివాసరావు, దేవరపల్లి రమణయ్య, జీవరత్నం, యరమాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణపై అవగాహన

కొండపి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొగాకు సాగు నియంత్రణపై కొండపి పొగాకు వేలం కేంద్రం సిబ్బంది శనివారం పెరిదేపి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. నర్సరీల వద్ద బ్యానర్‌లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు గాయత్రి, రమేష్ పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం ఇవ్వాలి

కొండపి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు పోషకాహారం ఇవ్వడం ద్వారా వారు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో బి.సుశీలాదేవి సూచించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని దేవిరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పోషకాహారం అందించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విక్టోరియారాణి, కిశోరబాలికలు పాల్గొన్నారు. గ్రామంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు.

ఆటోడ్రైవర్ల బ్యాంకు ఖాతాలకు నగదు జమ



హర్షం వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఒంగోలు(రూరల్), అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో గల 148మంది ఆటోడ్రైవర్లకు రాష్ట్రప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకం నగదు వారి బ్యాంకు ఖాతాలకు శనివారం జమ చేసిందని ఎంపీడీవో రాజశేఖరరావు తెలిపారు. ఆటో కలిగిన ప్రతి డ్రైవర్‌కు రూ.15వేల వంతున సీఎం చంద్రబాబునాయుడు బటన్ నొక్కటంతో వారి బ్యాంక్ ఖాతాలలో నగదు జమ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

కౌశల్ క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్, ప్రతినిధులు

ఒంగోలు విద్య, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థుల్లోని ప్రతిభాపాఠవాలు, సృజనాత్మకతను వెలికితీసేందుకు కౌశల్ క్విజ్‌పోటీలు ఒక సాధనంగా ఉపయోగపడుతాయని డీఈవో కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. భారతీయ విజ్ఞానమండలి, అప్‌కాస్ట్ సైన్స్ సెంటర్ సంయుక్తంగా నిర్వహించే ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను శనివారం స్థానిక డీఈవో కార్యాలయంలో డీఈవో కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీలు పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తారు. విజేతలకు ప్రశంసపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేస్తారు. ఈ పోటీలకు పాఠశాలలో ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొనవచ్చు. నవంబరులో ఈ పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వర్, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, జిల్లాసైన్స్ అధికారి టి.రమేష్, ఎస్.నాగేశ్వరరావు, గుడివాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని తండ్రీకుమారులకు గాయాలు

పెద్ద దోర్నాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో తండ్రీకుమారులకు గాయాలయ్యాయి. ఈ ఘటన చిన్నదోర్నాల అడ్డరోడ్డు వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శనివారం జరిగింది. ఈ ప్రమాదంలో చిన్నగుడిపాడుకు చెందిన వల్లపునేని ప్రసాద్, కుమారుడు ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. స్వగ్రామం నుంచి అడ్డరోడ్డుకు వస్తుండగా వెనుక విజయవాడ వైపు వెళ్తున్న బస్సు అదుపుతప్పి ఢీకొంది. దీంతో కింద పడి తండ్రీకుమారులు గాయపడగా దోర్నాల ఆసుపత్రికి తరలించారు.



రంగనాయక స్వామి దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు (ఇన్‌సెట్లో) స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో నాగయ్య

రంగనాయక స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- తాజా వానలతో నిలిచిన దర్శనాలు తిరిగి ప్రారంభం

కంభం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. తుఫాన్‌ల ప్రభావం, భారీ వర్షాల కారణంగా గత రెండు శనివారాలు స్వామివారి దర్శనాలు నిలిపివేయడంతో భక్తులు స్వామివారిని దర్శించుకోలేకపోయామని బాధకు లోనయ్యారు. ప్రస్తుతం శనివారం స్వామివారి దర్శనానికి ఆలయ అధికారులు అనుమతించడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 5గంటల నుంచి పూజారులు ప్రత్యేక పూజలు ప్రారంభించగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈవో మల్లవరపు నాగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సత్రాల్లో ఉచిత అన్నదానాలు నిర్వహించారు.



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన కాకర్ల సర్పంచ్ రంగమ్మ

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మరో ఆరు నెలల్లో స్థానిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో నియోజకవర్గంలో వైసీపీని వీడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. తాజాగా అర్ధవీడు మండలం కాకర్ల వైసీపీ సర్పంచ్ జూపల్లి రంగమ్మ శనివారం ఆ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. కాకర్లకు చెందిన టీడీపీ నాయకులు కోటపాటి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ సర్పంచ్ జూపల్లి రంగమ్మ, ఆమె అనుచరులతో టీడీపీ కార్యాలయానికి రాగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అందరం కలిసి గ్రామాలను అభివృద్ధి చేద్దామని అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన వారిలో కాకర్లకు చెందిన రావుల చిన్నరంగయ్య, తుల్లూరి శేషగిరి, కందుల ఆమోస్, వారి అనుచరులు ఉన్నారు. రాజకీయాలకు అతీతంగా తెలుగుదేశం పార్టీలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని గమనించి పార్టీలో చేరుతున్నామని, భవిష్యత్‌లో టీడీపీని మరింత బలోపేతం చేస్తామని సర్పంచ్ రంగమ్మ పేర్కొన్నారు.

ఉపయోగం లేని రైలు పొడిగింపు

- చెన్నైకి కోరితే ధర్మవరం ఇచ్చారు
- పెదవి విరుస్తున్న ఉమ్మడి నాలుగు జిల్లాల ప్రయాణికులు

గిద్దలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా తిరుపతి వరకు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలును ధర్మవరం వరకు పొడిగించారు. ఈ రైలు పొడిగింపు వలన అదనంగా ఎలాంటి ప్రయోజనాలు లేకపోవడంతో ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. వాస్తవానికి గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా తిరుపతికి ప్రతిరోజు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలును చెన్నై వరకు పొడిగించాలని రెండేళ్లుగా అటు ప్రజాప్రతినిధులు, ఇటు ప్రయాణికులు కోరుతున్నారు. కానీ ఈ విజ్ఞప్తులు రైల్వే ఉన్నతాధికారుల చెవికి ఎక్కలేదు. కేవలం ఈ రైలును పొడిగిస్తే సరిపోతుందన్న కారణంగా ఎవరికీ ఎటువంటి ఉపయోగం లేని విధంగా పొడిగింపు నిర్ణయం తీసుకోవడం విమర్శలపాలు అవుతున్నది. గిద్దలూరు మీదుగా ధర్మవరానికి మూడు రైళ్లు ఉండగా గుంటూరు నుంచి ధర్మవరానికి ఒక రూటులో వెళితే 582 కిలోమీటర్లు దూరం ఉంటుంది. మరో రూటులో వెళ్లే రైలు 479 కిలోమీటర్ల దగ్గరి దారిలోనే వెలుతున్నది. అయితే ప్రస్తుతం పొడిగించిన గుంటూరు-గిద్దలూరు-తిరుపతి - ధర్మవరం రైలు ఎక్కితే ధర్మవరం చేరాలంటే 824 కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే. అంటే 240 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. దీని వలన ప్రయాణికులు ఎవరూ ఈ రైలును ఎంచుకునే అవకాశం ఉండదు. ఈ రైలు పొడిగింపు వలన కేవలం తిరుపతి - ధర్మవరం మధ్య ఉండే ప్రాంతాల వారికి మాత్రమే అంతో ఇంతో ఉపయోగం ఉంటుందేతప్ప పొడిగింపు నిర్ణయాన్ని కోరిన ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కడప జిల్లాల ప్రయాణికులకు ఏ మాత్రం ఉపయోగం ఉండదు. చెన్నై ప్రాంతానికి వెళ్లాలంటే ఈ ప్రాంత ప్రయాణికులు, వ్యాపారులు, ఉద్యోగులు ఈ రైలులో తిరుపతి వరకు వెళ్లి అక్కడి నుంచి మరో రైలు గాని, బస్సులో గాని చెన్నైకి వెళ్తుంటారు. లేకపోతే ఒంగోలు వరకు బస్సులో వెళ్లి అక్కడి నుంచి రైలులో చెన్నైకి వెళ్తుతుంటారు. ప్రతిరోజు రెండు, మూడు వందల మంది గిద్దలూరు నుంచి చెన్నై ప్రాంతానికి వివిధ రూట్లలో వెలుతున్నారు. అదే తిరుపతి వరకు వెళ్తున్న ఈరైలును అక్కడి నుంచి కేవలం 150 కిలోమీటర్ల దూరం ఉన్న చెన్నై వరకు పొడిగిస్తే నేరుగా చెన్నైకి వెళ్లే అవకాశం ఉంటుందని ప్రయాణికులు ఏళ్ల తరబడి విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నప్పటికీ రైల్వే అధికారులు మాత్రం ఈ విజ్ఞప్తులు చెవికి ఎక్కించుకోకుండా రైలు పొడిగిస్తే చాలు అన్నట్లుగా చెన్నైకి కోరితే ధర్మవరంకు పొడిగించడం పట్ల ప్రయాణికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా తిరుపతి వెళ్లే రైలును శాశ్వత ప్రాతిపదికన చెన్నై వరకు పొడిగించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్

- సూర్యఘర్ పథకంలో ధర తగ్గింపు

ఒంగోలు క్రైం,అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకం వినియోగదారులకు జీఎస్టీ తగ్గింపుతో రూ.9 వేలు నుంచి రూ.11 వేల వరకు లబ్ధి చేకూరుతుందని విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక విద్యుత్ భవన్‌లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎస్ఈ మాట్లాడుతూ సూర్యఘర్ ద్వారా 3 కేవీ, 2కేవీ ఏర్పాటు చేసుకునే వారికి ప్యానల్ ధరలలో జీఎస్టీ తగ్గిందన్నారు. ఈ సందర్భంగా జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ టీ.భాస్కర్ మాట్లాడుతూ అన్ని వస్తువులపై జీఎస్టీ తగ్గిందన్నారు. అందువలన ప్రతి వస్తువు ధరలు మార్కెట్‌లో తగ్గాయన్నారు. కార్యక్రమంలో ఈఈలు వీరయ్య, రఘుబాబు, ఎస్ఏవో సుబ్బారావు, విజిలెన్స్ సీఐ బీటీనాయక్, డీఈఈ పాండురంగారావు పాల్గొన్నారు.

పేద, మధ్య తరగతికి అండగా కూటమి ప్రభుత్వం

- 'ఆటో డ్రైవర్ల సేవ'లో పథకాన్ని ప్రారంభించిన ఇన్‌చార్జి మంత్రి ఆనం
- జిల్లాలో 11,356 మంది ఖాతాలలో రూ. 17.3 కోట్లు జమ

ఒంగోలు క్రైం,అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పేద,మధ్య తరగతి కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా ఇన్‌చార్జి, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మినీ స్టేడియంలో 'ఆటో డ్రైవర్ల సేవ' పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ రాయుడు సుశీల అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మంత్రి ఆనం మాట్లాడుతూ పేద,మధ్య తరగతి కుటుంబాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ హామీలకు కార్యరూపం ఇస్తూ ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. అదే క్రమంలో ఆటోడ్రైవర్ల కుటుంబాలలో భరోసా కల్పించేందుకు ఆటోడ్రైవర్ల సేవ పథకాన్ని ప్రారంభిచినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లకు రూ. 436 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 11,356 మంది లబ్ధిదారులకు రూ.17 కోట్ల 3లక్షల 40 వేలు లబ్ధిదారుల ఖాతాలలో జమ అయిందని వివరించారు. ఒంగోలు నియోజకవర్గంలో అత్యంత ఎక్కువ మంది 2,401 మంది ఆటోడ్రైవర్లకు లబ్ధి చేకూరిందని అన్నారు. గత ప్రభుత్వంలో కొద్దిమందికి 10 వేలు ఇవ్వగా నేడు కూటమి ప్రభుత్వం అందరికీ ఇవ్వడంతోపాటు రూ.15 వేలు పండుగ వాతావరణంలో ఇస్తుందని అన్నారు.



మినీ స్టేడియంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి ఆనం రామానారాయణరెడ్డి, వేదికపై ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్ తదితరులు



ఒంగోలు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోవాలాలు

ఒంగోలుపార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ 'ఆటో డ్రైవర్లసేవ'లో అనే పథకం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచించి ప్రవేశపెట్టినదని అన్నారు. ఆటోడ్రైవర్ల భవిష్యత్ గురించి వారిని ఆదుకునేందుకు ఈ పథకం రూపొందించారని తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఎల్లప్పుడు తన వంతు సహకారం అందిస్తానని అన్నారు.

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నా పేదల కోసం పనిచేస్తుందని తెలిపారు. ఎన్నికల హామీలను నేరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రూ. 15 వేలు ఇవ్వడం అభినందనీయం అన్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈఏడాది జిల్లాలో 11,356 మంది ఆటో డ్రైవర్లకు లబ్ధిచేకూరిందన్నారు. అర్హత ఉండి ఎవరికైనా పథకం కింద ఆర్థికసాయం అందక పోతే సమీప సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఏఎంసీ చైర్మన్ ఎస్.వెంకట్రావు,ఆర్యవైశ్య నాయకులు వెంకటేశ్వర్లు, వివిధ జిల్లా అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. సభలో ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీటీసీ సుశీల తదితరుల చేతుల మీదగా ఆటో డ్రైవర్లకు మెగా చెక్కును అందజేశారు.

ఆటో డ్రైవర్‌గా ఎమ్మెల్యే జనార్దన్

- ఆర్టీసీ డిపో నుంచి మినీ స్టేడియం వరకు ర్యాలీ
- ఒకే ఆటోలో ఇన్‌చార్జి మంత్రి, ఒంగోలు ఎంపీ తదితరులు

ఒంగోలు క్రైం,అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): 'ఆటో డ్రైవర్ల సేవ'లో పథకం ప్రారంభ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించి సభాస్థలిఅయిన మినీ స్టేడియంకు చేరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు ఖాకీ చొక్కా ధరించి ఆటో డ్రైవర్‌లా ఓ ఆటోను ర్యాలీకి ముందు నడిపారు. అదే ఆటోలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాతతోపాటు ఇతర ప్రతినిధులుప్రయాణం చేశారు. ఎమ్మెల్యే జనార్దనరావు ఆటోనడపడం, ఆటోలో ప్రజాప్రతినిధులు ప్రయాణం చేస్తూ విక్టరీ ని తెలియజేస్తూ చేతుల ఊపడం కార్యక్రమంతో మంచి ఊపు వచ్చింది.నేరుగా మినీ స్టేడియం వరకు ఆటోను నడిపిన జనార్దన్ ఆటో డ్రైవర్లలో ఉత్సాహన్ని నింపారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ట్రంకురోడ్డు మీదుగా ప్రకాశంభవన్ నుంచి నెల్లూరు బస్టాండ్ మినీ స్టేడియం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఒంగోలు ఇన్‌చార్జీ ఆర్డీవో కళావతి, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర ప్రసాద్, ఏవో శ్రీనివాసరావు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఫిబ్రవరి 23 నుంచి నెల రోజుల పాటు నిర్వహణ

ఒంగోలు విద్య, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్మీడియెట్ విద్యా మండలి ప్రకటించింది. ఇంటర్మీడియెట్ విద్యలో సంస్కరణలఫలితంగా పరీక్షలు సుదీర్ఘంగా నెల రోజుల పాటు జరగనున్నాయి. ఈఏడాది వరకు పరీక్షలు మార్చిమొదటి వారంలోనే మొదలు కాగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 23నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.గతంలో 16 రోజులకు పరీక్షలు ముగుస్తుండగా వచ్చే ఏడాది మాత్రం మార్చి 23 వరకు అంటే నెల రోజుల పాటు పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్మీడియెట్ గ్రూపులకు వేర్వేరుగా పరీక్షలు జరుగుతున్నాయి. గత ఏడాది గణితం1ఏ, 1బీ రెండు పేపర్లు ఉండగా ఈవిద్యాసంవత్సరం నుంచి గణితం ఒక పేపర్‌కే పరీక్ష ఉంటుంది. అదే విధంగా బైపీసీ విద్యార్థులకు బోటనీ,జువాలజీ పరీక్షలు వేర్వేరుగా నిర్వహించగా వచ్చే ఏడాది నుంచి బయాలాజీ పేరుతో ఈరెండు సబ్జెక్టులకు కలిపి ఒకే పరీక్ష నిర్వహిస్తున్నారు. ఆర్ట్స్ గ్రూపునకు కూడా ప్రతి సబ్జెక్టుకు వేర్వేరుగా పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు రోజూ ఉదయం 9నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రోజుమార్చిరోజు పరీక్షలు జరుగుతాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్‌విద్యార్థులకు ఫిబ్రవరి 1నుంచి రోజు రెండు పూటలా ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. జనవరి 21నుంచి ఎథిక్స్ అండ్ హ్యూమనాటిస్, 23న పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయి.

మొదటి సంవత్సరం షెడ్యూల్ ఇదీ

ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 23నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. 23న తెలుగు/ సంస్కృతం, ఉర్దూ/హిందీ, తమిళం/ఒడియా/కన్నడ/ఫ్రెంచ్ ఇతర భాషల పేపర్-1, 25న ఇంగ్లీషు పేపర్-1, 27న హిస్టరీ పేపర్-1, మార్చి 2న గణితం పేపర్-1, 5న బయాలజీ పేపర్-1, 7న ఎకనామిక్స్ పేపర్-1, 10న ఫిజిక్స్, 12న కామర్స్, 14న సివిక్స్, 17న కెమిస్ట్రీ, 20న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, 24న మోడ్రన్ లాంగ్వేజీ, జాగ్రఫీ పేపర్-1 పరీక్షలు జరుగుతాయి.

ద్వితీయ సంవత్సరం షెడ్యూల్ ఇదీ

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 24నుంచి ప్రారంభమవుతాయి. 24న పార్ట్2 సెకండ్ లాంగ్వేజ్, 26న పార్టు1 ఇంగ్లీషు, 28న బోటనీ, హిస్టరీ, మార్చి 3న గణితం, సివిక్స్, 6న జువాలజీ, ఎకనామిక్స్, 9న గణితం-2బి, 11న కామర్స్, సోషియాలజీ, 13న ఫిజిక్స్, 16న మోడ్రన్ లాంగ్వేజి, జియోగ్రఫీ, బ్రిడ్జికోర్సు గణితం-2, 18న కెమిస్ట్రీ, 23న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ పేపర్-2 పరీక్షలు జరుగుతాయి. పరీక్షల షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కే ఆంజనేయులు కోరారు.

20 నుంచి ఏసీ,ఫ్రిజ్ రిపేర్లపై ఉచితశిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని గ్రామీణప్రాంత యువకులకు ఏసీ, ఫ్రిజ్ రిపేర్లపై ఉచిత శిక్షణను ఈనెల 22వతేదీ నుంచి 30 రోజుల పాటు ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థడైరెక్టర్ పీ. శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18నుంచి 45 ఏళ్ళలోపు యువకులు తమ వివరాలతో పేర్లనునమోదు చేసుకోవాలన్నారు. ఉచిత శిక్షణ కాలంలో భోజనవసతి, సదుపాయాలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 9573363141 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఉపాధి శ్రామికులు ఈకేవైసీ చేయించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనికోరే ప్రతిశ్రామికుడు నవంబరు 7వతేదీలోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. నవంబరు 1నుంచి పనికోరే వారికి ఈకేవైసీ పూర్తికాకపోతే పని ఇచ్చే అవకాశం ఉండదని తెలిపారు. గ్రామాల్లో ఈకేవైసీ కార్యక్రమం జరుగుతుందని, అందువల్ల ప్రతి ఉపాధి కూలీ వారి జాబ్ కార్డుకు అనుగుణంగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. క్షేత్ర స్థాయి సహాయకులు వారి వారి గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో శ్రామికులందరూ ఈకేవైసీ పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

వెనుకబడిన ప్రాంతం .. ఉద్యోగాల్లో ప్రథమం

- జిల్లాలో 661 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక
- అందులో వైపాలెం నియోజకవర్గం నుంచే 94 మంది
- వారిలో పేదవర్గాల పిల్లలే అధికం



ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎరిక్షన్‌బాబు, అధికారులు, టీడీపీ నాయకులు

త్రిపురాంతకం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూసిన వాళ్లకు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట మేరకు డీఎస్సీ ప్రకటించింది. ఎలాగైనా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలనే పట్టుదల అభ్యర్థుల్లో పెరిగింది. సాంకేతిక సదుపాయాలు సరిపడా లేకున్నా, ఆర్థిక వనరులు అంతంతమాత్రమే అయినా వారిలో ఉన్న కృషి, పట్టుదలే ఆశయసాధకులుగా చేసింది. ఏకంగా ఇప్పుడు ఎర్రగొండపాలెం నియోజవర్గంలోని గ్రామాల నుంచే 94 మంది ఉపాధ్యాయ వృత్తిని అందుకొని పాఠశాలలకు రాబోతున్నారనే ఆనందం ఆ కుటుంబాల్లో కనిపిస్తోంది.

జిల్లాలో ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు మొత్తం 661 మంది. అయితే వారిలో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని గ్రామాల నుంచి ఎంపికైన వారు 94 మంది ఉండడం విశేషం. వారిలో 20 మంది మహిళలు ఉపాధ్యాయులుగా రాబోతున్నారు. వీరందరికి ఇప్పుడు విద్యాబోధనపై శిక్షణ ఇస్తుండగా, త్వరలోనే కౌన్సెలింగ్ జరిగి ఆయా పాఠశాలలకు టీచర్లుగా రానుండడంతో చర్చ సాగుతోంది. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో తమ పిల్లలు పొందిన ఈ ఘనతను తల్లిదండ్రులు ఉపాధ్యాయ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశం పొందిన వారిలో ఎక్కువ మంది పేదవర్గాల పిల్లలే ఉండడం విశేషం. కూలీనాలీ చేసుకుని జీవనం సాగించే కుటుంబంలో ఉపాధ్యాయునిగా తమ కుమారుడు ఉద్యోగం పొందాడంటే వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఇంకా కొన్ని గ్రామాల్లో పరిశీలిస్తే పెద్దారవీడు మండలంలోని చట్లమిట్ట నుంచి ఐదు మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందారు. వీరిలో నలుగురు పేదవర్గానికి చెందిన వారు ఉన్నారు. దోర్నాలకు చెందిన భాస్కర్ అనే యువకుడు పట్టుదలతో నాలుగేళ్లుగా ప్రైవేటు పాఠశాలలో విద్యాబోధన చేస్తూనే డీఎస్సీ కోసం సిద్ధపడుతూ లక్ష్యం సాధించాడు. తండ్రి మరణించి తల్లి కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నా తాను మాత్రం నిరాశ చెందకుడా తనకు ప్రైవేటు పాఠశాలలో వచ్చే అరకొర సంపాదనతో చదువుతూ నేడు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా అవకాశం దక్కించుకున్నాడు. ఇలాంటి వారు ఆయా గ్రామాల్లో ఎంతోమంది ఉన్నారు.

అవకాశాలు మనం కోరుకున్నప్పుడు రావు. వచ్చినప్పుడు మాత్రమే వాటిని అందుకోవాలనే ఆలోచనకు రూపకల్పన చేసుకున్న ఈ ప్రాంత యువత ఉద్యోగాలు పొందిన తీరును పలువురు అభినందిస్తుండగా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ ఇచ్చి తమ కలలు సాకారం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు తాజా ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఇమ్మడిచెరువు శివారులో చిరుత సంచారం

వెలిగండ్ల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వెలిగండ్ల మండలంలో చిరుత సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇమ్మడిచెరువు గ్రామ శివారు ప్రాంతంలో శనివారం రాత్రి పొలాల్లో సంచరిస్తున్న చిరుతపులి రోడ్డు దాటుతూ వాహనచోదకులకు కనిపించింది. దీంతో వారు భయపడి గ్రామంలోకి పరుగులు తీశారు. గతనెల 29న మండలంలోని మరపగుంట్ల పొలాల్లోకి వచ్చిన చిరుతను చూసి కాపలాదార్లు భయపడిన విషయం తెలిసిందే. చిరుతలు అడవిని వదిలేసి పొలాల్లోకి వస్తుండటంతో ప్రజలు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

తహసీల్దార్‌పై వ్యక్తి దౌర్జన్యం

మార్కాపురం రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయంలో తన చాంబర్‌లో తహసీల్దార్ చిరంజీవిపై వ్యక్తి దుర్భాషలాడుతూ దాడికి యత్నించిన ఘటన శనివారం రాత్రి జరిగింది. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోలభీమునిపాడు గ్రామానికి చెందిన బోయలపల్లి పోలిరెడ్డి తన అనుచరులతో కార్యాలయానికి వచ్చి తనపై అనుచితంగా ప్రవర్తించి తన విధులకు ఆటంకం కలిగించారని పోలీసులకు, జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన మందా తిరుపతమ్మ పట్టా సబ్ డివిజన్‌కు దరఖాస్తు చేసుకోగా, సెప్టెంబరు 6న దానికి సంబంధించి తహసీల్దార్ పరిష్కరించారు. ఇక్కడి భూమి విషయమై తిరుపతమ్మతో వివాదాలున్న పోలిరెడ్డి సమస్య ఎందుకు పరిష్కరించారని తహసీల్దార్‌పై దౌర్జన్యానికి పాల్పడినట్లు తెలిసింది.

ఆటో డ్రైవర్లకు అండగా

» అర్హులకు రూ.15వేలు చొప్పున జమ » ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
» గిద్దలూరులో భారీ ర్యాలీ, ఆటో నడిపిన ఎమ్మెల్యే

గిద్దలూరు టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆటోడ్రైవర్ల సేవలో పథకం ప్రారంభం సందర్భంగా ఆయన ఆటో డ్రైవర్లతో కలిసి ఆటోన డిపారు. ఆటోల భారీ ర్యాలీ నిర్వహించగా పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి కుమ్మరాంకట్ట, రైల్వేస్టేషన్, రాచర్లగేటు సెంటర్ నుంచి మార్కెట్‌యార్డు వరకు కొనసాగింది. ర్యాలీ ముందు భాగంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆటో నడుపుతూ వెళ్లారు. అనంతరం మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనలో ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు ప్రజాప్రభుత్వం వారి రుణభారం తగ్గించే దిశగా అండగా ఉండేలా పథకం అమలు చేసిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాన్ ముందుకు సాగుతున్నారన్నారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒకొక్కరికీ రూ.15వేల చొప్పున ఆర్థిక సాయం అందచేస్తున్నట్లు తెలిపారు. ఈ నియోజకవర్గంలో 1211 మంది ఆటో డ్రైవర్లకు రూ.1,81,65,000 వారి ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు. వీరిలో ఎక్కువ మంది బీసీలు, ఎస్సీలు ఉన్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆటోడ్రైవర్లకు ఆయన రూ.1.81కోట్ల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణ బాబు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కటికె యోగానంద్, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డైరెక్టర్ గోన చెన్నకేశవులు, పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, మండలపార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, జనసేన నాయకులు లంకా నరసింహారావు, బీజేపీ నాయకులు పిడతల రమేష్ రెడ్డి, నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్ల సేవలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే లక్ష్యం : ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్ : ఆటో డ్రైవర్‌లకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి మార్కెట్ యార్డు వరకు ఆటో డ్రైవర్‌లతో కలిసి శనివారం భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల ఆటో నడిపి ఉత్సాహపరిచారు. అనంతరం మార్కెట్ యార్డులో ఆటో డ్రైవర్‌ల సేవలో పథక ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. అన్నివర్గాల ప్రజల శ్రేయస్సు కోసం చంద్రబాబు పరితపిస్తున్నారన్నారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని, ఖజానాను వైసీపీ పాలకులు గుల్ల చేశారరని కందుల ధ్వజమెత్తారు. అప్పుల ఆంధ్రాను గాడిలో పెట్టడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని చంద్రబాబు పరుగుపెట్టిస్తున్నారని అన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయి ప్రజలు సంతోషంగా ఉన్నారని కందుల అన్నారు. నియోజకవర్గంలో 1831 మంది ఆటో, రిక్షా, క్యాబ్ డ్రైవర్‌లకు రూ.2కోట్ల 74లక్షల 65వేల చెక్కును లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, ఆర్డీవో శ్రీచందన, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీఐ మాధవరావు, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున, మండల పార్టీ అధ్యక్షుడు కాకర్ల శ్రీనివాసులు, బీజేపీ నాయకుడు పీవీ క్రిష్ణారావు పాల్గొన్నారు.


ఆటో నడిపి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల

ఆటో డ్రైవర్ల సేవకు 151మంది ఎంపిక

రాచర్ల : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఆటో డ్రైవర్ల సేవ పథకానికి మండలం నుంచి 151మంది ఆటోవాలాలు ఎంపికైనట్లు ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి తెలిపారు. మండలం నుంచి దాదాపు 168మంది ఆటో డ్రైవర్లు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోగా 151 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఆకవీడు -1 26, ఆకవీడు -2 3, చోళ్లవీడు 10, చిన్నగానిపల్లి 4, జేపిచెరువు 3, గౌతవరం, అనుములపల్లి 11, రాచర్ల-1 16, రాచర్ల-2 6, అనుములవీడు 27, సోమిదేవిపల్లి 10, గుడిమెట్ట, ఒద్దులవాగుపల్లి 11, ఎడవల్లి 3, సత్యవోలు 21మంది ఎంపికైనట్లు ఆయన తెలిపారు. 17మంది దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి.

ఎర్రగొండపాలెం : ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆటో డ్రైవర్లకు అండగా ఉండేలా శనివారం రూ.15వేలు జమ చేసిన సందర్భంగా శనివారం ర్యాలీని ప్రారంభించి అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. ఎన్నికల హామీలో లేనప్పటికీ ఆటోవాలాలకు అండగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ పథకం ప్రారంభించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఆటోడ్రైవర్ల సేవా పథకం కింద 1073 మంది ఆటో డ్రైవర్ల రూ.1,60,95000 జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు, నియోజకవర్గ టీడీపీ నాయకులు, నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లు ఆటోలతో ర్యాలీలో పాల్గొని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



ఆటో డ్రైవర్లకు చెక్కును పంపిణీ చేస్తున్న బాలాజీ, ఎరిక్షన్‌బాబు

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఊరట

పొదిలి, అక్టోబరు 4 : (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు, రైతులకు ఎంతో ఊరటనిస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇమాంసాహెబ్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం నుంచి పెద్దబస్టాండ్, చిన్నబస్టాండ్ కూడలి వరకు వ్యవసాయ, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణలతో అన్నదాతలకు, ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కల్పిస్తూ ట్రాక్టర్లతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు వరికుంట్ల అనీల్, రైతుసంఘ నాయకులు ఆవులూరి యలమంద, పీఏసీఎస్ చైర్మన్ వై వెంకటేశ్వర రెడ్డి, షేక్ గౌస్ పాల్గొన్నారు.

పెద్దారవీడు : జీఎస్టీ సంస్కరణలతో వ్యవసాయ పరికరాల ధరలు తగ్గాయని ఏవో ఎన్.లక్ష్మీ నారాయణ అన్నారు. పెద్దారవీడు బస్టాండ్ నుంచి మండల కాంప్లెక్స్ వరకూ నూతన జీఎస్టీ- పరికరాలపై తగ్గిన ధరలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిందు సేద్యం హెక్టారుకు రూ.1800 నుంచి రూ.5000 వరకూ పంట స్వభావాన్ని పట్టి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి

బేస్తవారపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలోని ఉపాధి హామీ జాబ్ కార్డులున్న ప్రతి ఒక్కరూ ఫీల్డ్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్ వద్ద ఈకేవైసీని చేయించుకోవాలని లేకుండా జాబ్ కార్డులు చెల్లుబాటు కాకుండా పోతాయని ఏపీవో గురువర కుమార్ తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ అంబటి రమేష్ ఉన్నారు.

వీవోఏల సమస్యలను పరిష్కరించాలి

మార్కాపురం రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో డీఆర్‌డీఏ వెలుగులో పనిచేస్తున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ శనివారం వీవోఏలు విజ్ఞప్తి చేశారు. ఎస్సీబీసీ కాలనీలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం పిచ్చయ్యకు వినతిపత్రం అందజేశారు. సొంత 2జీ ఫోన్ల స్థానంలో ప్రభుత్వం వెంటనే 5జీ ఫోన్‌లను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏలు అనిత, రత్నకుమారి, కాశీంబి, శ్వేత, రంజాన్‌బి, దేవకుమారి, వలివా, సీఐటీయూ నాయకుడు రఫి పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణదేవరాయుల విగ్రహావిష్కరణ

గిద్దలూరు టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాదర్‌వలిస్వామి దర్గా ఎదురుగా ఆదివారం శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ జరుగుతుందని బలిజ సేవా సంఘం అధ్యక్షుడు యగటీల రంగసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, నంద్యాల శాంతిరామ్ మెడికల్ కళాశాల, ఆర్‌జీఎం విద్యాసంస్థల అధినేత మిద్దె శాంతిరాముడుతోపాటు పలువురు ముఖ్యులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

ఆరీపుద్దీన్‌కు అవార్డ్

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): యువ కేర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆరీపుద్దీన్ ఏపీ రాష్ట్ర ఉత్తమ ఎన్‌జీవో అవార్డు-2025 హైదరాబాద్‌లోని అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆరీపుద్దీన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని అన్వర్ ఉలుం కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రాంగణంలో దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు చెప్పారు. సామాజిక సేవ, రక్తదానాలు, వృథాగా పడవేసిన ఆహారాన్ని నిరుపేదలకు అందించడం తదితర సేవలకు గుర్తింపుగా అవార్డు ఇచ్చారని తెలిపారు.

బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. తండ్రీ కొడుకులకు గాయాలు

పెద్ద దోర్నాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళ్తున్న మోటారు సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో తండ్రీకొడుకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై చిన్నదోర్నాల అడ్డరోడ్డు వద్ద శనివారం జరిగింది. ఈ ప్రమాదంలో చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన వల్లపునేని ప్రసాద్, కుమారుడు ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. తండ్రీకొడుకు బైకుపై స్వగ్రామం నుంచి అడ్డరోడ్డుకు వస్తుండగా వెనుక విజయవాడ వైపు వెళ్తున్న బస్సు అదుపుతప్పి బైకును ఢీకొంది. గాయపడిన వారిని 108లో దోర్నాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు.

రేపు వాహనాలకు వేలం

మార్కాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. ఎక్సైజ్ నేరాలలో స్వాధీనం చేసుకున్న మూడు వాహనాలకు వేలంపాట జరుగుతుందని, ఆసక్తిగలవారు పాల్గొనాలని సీఐ కోరారు.

వన్యప్రాణి వారోత్సవాలు

కంభం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణి వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా అర్ధవీడు మండల పరిధిలో కాకర్ల, యాచవరం, బొమ్మిలింగం గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణ పట్ల అవగాహన కార్యక్రమాలు మార్కాపురం రేంజ్ నాగులవరం సెక్షన్ సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రసాద్‌రెడ్డి, బీట్ అధికారులు ఏడుకొండలు, ధనలక్ష్మీ, సుబ్బారెడ్డి, స్నేక్ క్యాచర్ నిరంజన్, గ్రామ ప్రజలు హాజరయ్యారు.

ఎస్సీ కాలనీల్లో వసతులు కల్పించాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దళితులు నివశిస్తున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జవ్వాజి రాజు అన్నారు. స్థానిక సుందరయ్య కాలనీలో కేవీపీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జెండాను ఆవిష్కరించారు.

మ్యాథమెటిక్స్ కిట్ల పంపిణీ

పెద్ద దోర్నాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎంఈవో కార్యాలయంలో మ్యాథమెటిక్స్ కిట్లను ఎంఈవో మస్తాన్ నాయక్ శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మండ్ల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ మాత నగరోత్సవం

ముగిసిన దసరా నవరాత్రి పూజలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శనివారం రాత్రి పులి వాహనంపై నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. 10 రోజుల పాటు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం, చండీ పారాయణం, వాసవీ మూలమంత్ర జపం, దుర్గా సూక్త, శ్రీసూక్త పారాయణం ప్రతిరోజు నిర్వహించారు. శనివారం మహిళలు కలశాలతో పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి పులి వాహనంపై అమ్మను శోభాయమానంగా అలంకరించి నగరోత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, తీన్‌మార్ తప్పెట్ల హోరు, మహిళా బృందాల కోలాటాలు, రంగురంగుల బాణసంచా కాల్పులు, వాసవీమాత నామస్మరణ మధ్య నగరోత్సవం సాగింది. భక్తులు అడుగడుగునా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొంతల పుల్లారావు, కార్యదర్శి వక్కలగడ్డ సురేష్ కుమార్, కోశాధికారి చెక్కా మాలకొండ చిననరసింహారావు, కమిటీ నాయకులు, సభ్యుల ఆధ్వర్యంలో నగరోత్సవం నిర్వహించారు.

కనులపండువగా అమ్మవారి నగరోత్సవం

కంభం : జిల్లాలోని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేసే దసరా నవరాత్రి ఉత్సవాలు కంభంలో శుక్రవారం రాత్రి అర్ధరాత్రి 12.30గంటలకు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దిని అలంకారంలో సింహ వాహనంపై ఊరేగుతూ పట్టణ పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం శనివారం ఉదయం 11.30గంటలకు ముగిసింది. ఈ గ్రామోత్సవంలో అమ్మవారు ఊరేగింపులో అగ్రభాగాన త్యాగరాజు మ్యూజికల్ బ్యాండ్, ఆర్కెస్ట్రా, లోకల్ బ్యాండ్ సెట్, కేరళ సింగారి మేళం, నరసరావుపేట కనకతప్పెట్లు, గంగాభవాని వెరైటీ డ్రమ్స్, తెలంగాణ బోనాల హంస వాహనం, లైటింగ్ ప్రభ, పులి బండ్లు, గజవాహనాల విన్యాసాలు అలరించాయి. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల నుంచే కాగా ఇతర ప్రాంతాల నుంచి కూడ వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. పుర వీధులలో ఊరేగింపుకు వచ్చిన అమ్మవారికి భక్తులు కాయకర్పూరాలు సమర్పించారు. కంభంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేసే దసరా పండుగ చివరి రోజు గ్రామోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మార్కాపురం డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో నలుగురు సీఐ, 10మంది ఎస్సైలు, 25మంది హెడ్ కానిస్టేబుళ్లు, 300మంది కానిస్టేబుళ్లు, 200మంది హోంగార్డులు, 50మంది రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

ఘనంగా గ్రామోత్సవం

గిద్దలూరు : దసరా శరన్నవరాత్రులలో భాగంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని శుక్రవారం రాత్రి


కంభంలో అమ్మవారి నగరోత్సవంలో పాల్గొన్న ప్రజలు

ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణ మధ్య ఉత్సవ విగ్రహాలతో అమ్మవారిశాల నుంచి బయలుదేరిన గ్రామోత్సవం రాత్రంతా ప్రధాన వీధుల గుండా సాగి శనివారం ఉదయం 8గంటలకు తిరిగి అమ్మవారిశాలకు చేరుతున్నది. ప్రజలు అమ్మవారికి పసుంకాన్ని అందచేసి దర్శించుకున్నారు. గ్రామోత్సవం అనంతరం శనివారం మధ్యాహ్నం అమ్మవారిశాల వద్ద వసంతోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆర్యవైశ్యులు రంగు నీళ్లను ఉత్సాహభరితంగా చల్లుకున్నారు. ఉట్టికొట్టే కార్యక్రమం జరిగింది. అమ్మవారు శేషపాన్పు అలంకారంలో శనివారం సాయంత్రం భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కార్యక్రమాలలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆవోపా సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన దేవీ నవరాత్రులు

రాచర్ల : రాచర్ల శ్రీ పట్టాభి రామస్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. ఆలయ అర్చకుడు కట్ట సతీష్ శాస్త్రి శనివారం అమ్మవారి విగ్రహానికి పూజలు నిర్వహించి అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించి అక్కపల్లి గ్రామ సమీపంలోని శ్రీ కనక సురభేశ్వర కోనలో గుండ్లకమ్మ వాగులో గంగ పూజ నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


బంగారు చీర అలంకరణలో వాసవీ మాత


రాచర్లలో అమ్మవారి ఊరేగింపు

ఆర్థిక ఒడిదొడుకుల్లోనూ హామీల అమలు

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- నియోజకవర్గంలో 1136 మంది ఆటో డ్రైవర్లకు లబ్ధి

కనిగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలుచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక అమరావతి ప్రాంగణంలో ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ముందుగా సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఒడిదొడుకుల్లో ఉన్నప్పటికీ ఆటో డ్రైవర్లను ఆదుకుంటున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో 1136మందికి రూ1,70,40,000 నగదు ఆటో డ్రైవర్ల ఖాతాల్లో జమైనట్లు చెప్పారు. ప్రతి ఆటోడ్రైవర్ ఖాతలో నేరుగా రూ.15 వేలు నగదు జమ చేసి ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు. ఇది ఎన్డీయే ప్రభుత్వం నెరవేర్చిన మరోహామీ అని చెప్పారు. ఇది ప్రభుత్వానికి ప్రజల పట్ల ఉన్న బాధ్యతను తెలిపే నిదర్శనంగా భావించాలన్నారు. ప్రభుత్వం అందించిన ఈసహాయాన్ని ప్రతి ఆటోడ్రైవర్ తమ కుటుంబ అబివృద్ధికి వినియోగించుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఆటోడ్రైవర్లకు నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ కావటంతో వారి ఆనందానికి అవదులు దాటాయి. పెద్దఎత్తున ఆటోలతో ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. ఆటోలకు జెండాలు కట్టి సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్‌ను కీర్తిస్తూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహరెడ్డి ఆటోడ్రైవింగ్ చేసుకుంటూ ఆటోడ్రైవర్లతో కలసి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సన్నివేశం ఆటోడ్రైవర్లలో మరింత జోష్ నింపింది. ఆటో డ్రైవర్లు ఒక్కొక్కరిగా వచ్చి ఎమ్మెల్యేకు కరచాలన చేసి కృతజ్ఞతలు తెలిపారు.



ఆటో నడుపుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం

దర్శి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు అన్నివిధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రూ.15వేలు చొప్పున శనివారం వారి అకౌంట్‌లలో వేసిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ లక్ష్మి స్వయంగా ఆటో నడిపారు. అనంతరం కాలేజీలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలుచేస్తుందని చెప్పారు. సూపర్‌సిక్స్ పథకాలను సూపర్ సక్సెస్ చేసిన ప్రభుత్వం తాజాగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హమీని నెరవేర్చినట్టు చెప్పారు. దర్శి నియోజకవర్గంలో 1089 మంది డ్రైవర్లకు రూ.1,63,35000 నగదు జమ చేసినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో అన్నివర్గాల ప్రజలకు మేలు చేసిందన్నారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో పి. కల్పన, మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు

కనిగిరి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఎంతో మేలుచేకూరిందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి ప్రాంగణం నుంచి రైతులు పెద్దఎత్తున ట్రాక్టర్‌లతో శనివారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ 2.0 పన్నుల తగ్గింపుతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న నూతన జీఎస్టీ విధానాలతో రైతులకు అవసరమయ్యే ట్రాక్టర్లు, వాటి పరికరాలు, సస్యరక్షణ పరికరాలు, అంతర సేద్యానికి అవసరమయ్యే వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ 12శాతం నుంచి 5శాతానికి తగ్గించటంవల్ల రైతులకు ఆర్థిక వెసులుబాటు లభించిందన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగాభివృద్ధికి మరింత ముందడుగు వేయాలన్నారు.



ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కార్యక్రమంలో ఏడీఏ షేక్ జైనులాబ్దిన్, డీసీసీబీ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, యారవ శ్రీనివాసరావు, నంబుల వెంకటేశ్వర్లు, బాలు ఓబులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు అభివృద్ధికి కృషిచేయాలి

ముండ్లమూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ సుంకర సునీత అన్నారు. శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను పేదలకు సక్రమంగా అందజేయాలన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు ఇచ్చే ఎరువులు అందుబాటులో ఉండటంలేదన్నారు. మండల వ్యవసాయాధికారి తిరుమలరావు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఎరువులు ఉంచుతామని తెలిపారు. జీఎస్టీ తగ్గటం వలన రైతులు కొనుగోలు చేసే ట్రాక్టర్లు, గొర్రులు, నాగళ్ల తక్కువ ధరకు అందజేయటం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాన్‌బాబు, ఎంఈవో కాలేషావలి, సీడీపీవో పరిమళ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాగా, సమావేశానికి టీడీపీ ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. మండల కార్యాలయం వద్దకు వచ్చి కూడా సమావేశానికి రాలేదు.

ఉపాధ్యాయుల సమస్యలపై 7న ధర్నా

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7న ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయులకు రావాలసిన సరెండర్ లీవ్ డీఏ బకాయిలు, ఆర్థికపరమైన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు.

కేజీబీవీకి వాటర్‌ఫ్రిజ్ బహూకరణ

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురంలోని కస్తూర్బ గాంధీ బాలికల విద్యాలయంలో తాగునీటి అవసరాల కోసం పామూరుకు చెందిన గాడి నరసింహారావు శనివారం వాటర్ ఫ్రిజ్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జె. ప్రసాదరావు, ఆర్.కొండారెడ్డి, ప్రిన్సిపాల్ షేక్ రేష్మా, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు చిన్నారుల అప్పగింత

తాళ్లూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కూలి పనుల ఒప్పందం ముగిసినా పిల్లలను ఇంటికి పంపక పోవటంతో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరావు చొరవతో తల్లిదండ్రులకు అప్పగించారు. దారంవారిపాలెంకు చెందిన నాగులూరి పౌలు, సుభాషిణిలకు సంతానం ఎక్కువగా ఉండి పోషణ కష్టంగా ఉండటంతో తమ ఇద్దరు పిల్లలను నెల్లూరు జిల్లా తెట్టు గ్రామానికి చెందిన బాతుల పెంపకం యజమాని ప్రసాద్ వద్దకు పనికి వదిలిపెట్టారు. ఆసందర్భంగా యజమాని వద్ద కొంత అప్పుగా తీసుకున్నారు. బాకీ తీరినా పిల్లలను పంపకుండా ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరావు దృష్టికి తీసుక వెళ్లారు. ఈవిషయాన్ని కోటేశ్వరరావు ఇండియన్ లేబర్ లైన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఇండియన్ లేబర్ లైన్ విచారణలో ఇద్దరు పిల్లలను కాకినాడ ప్రాంతంలో నిర్బంధించారని తెలుసుకుని కాకినాడ సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే పిల్లలను గుర్తించిపోలీస్ శాఖకు అప్పగించాలని ఆదేశించారు. పోలీస్ యంత్రాంగం కాకినాడ ప్రాంతంలో ఉన్న ఇద్దరు చిన్నారులను తెట్టు వద్ద ఉన్న తల్లిదండ్రులకు అప్పగించారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ

దొనకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లో వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గుదల గురించి తహసీల్దార్ రమాదేవి, వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ ఆధ్వర్యంలో శనివారం దొనకొండలో ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ పరికరాలు ట్రాక్టర్లు, ట్రాక్టర్ పనిముట్లు డ్రోన్లు, డ్రిప్ ఇరిగేషన్, తదితర పరికరాలపై జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ప్రయోజనం చేకూరిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేలిముద్రలు సేకరించిన క్లూస్‌టీం

ముండ్లమూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో మారం కోటిరెడ్డి ఇంట్లో గుర్తు తెలియని దొంగలు తలుపులు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. శనివారం ఒంగోలు క్లూస్‌టీమ్ సీఐ రవీంద్రారెడ్డి, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దుండగులు పగులకొట్టిన బీరువాను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.కమలాకర్ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం దేవళంపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన సతీష్ నాయుడు అనుచరులపై పీడీయాక్ట్ కేసు నమోదు చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య డిమాండ్ చేశారు. శనివారం తాళ్లూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విగ్రహాలపై తరచూ దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదాం మాదిగ, డగ్లస్, వెంకటేశ్వర్లు, రమణయ్య, అనుపర్తి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



రవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దామచర్ల జనార్దన్, గొట్టిపాటి లక్ష్మి, పాపారావు, తాటికొండ శ్రీనివాసరావు, మేడగం వెంకటేశ్వరరెడ్డి

టీడీపీ నేత కొర్రపాటి రవికి నివాళి

తాళ్లూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కొర్రపాటి రవి మృతి టీడీపీకి తీరనిలోటని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. మండలంలోని కొర్రపాటివారిపాలెంలో శనివారం జరిగిన రవి కర్మ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీకి రవి చేసిన కృషి మరువలేనిదన్నారు. ముందుగా రవి చిత్రపటానికి నివాళులర్పించారు.

నివాళులర్పించినవారిలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, మానం రమేష్‌బాబు, తూము శివనాగిరెడ్డి, కొర్రపాటి శ్రీదేవిరామయ్య, గొంది రమణారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, ఐ.శ్రీనివాసరెడ్డి, ఐ.రమణారెడ్డి, రాచకొండ వెంకట్రావు, కైపు రామకోటిరెడ్డి, విద్యాసాగర్, కె.శ్రీనివాసరావు, మోడి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

అలాగే, కొర్రపాటి రవి చిత్రపటం వద్ద జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డిలు, పోశం శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు నివాళులర్పించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

దొనకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ టి.త్యాగరాజు హెచ్చరించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు శనివారం డ్రోన్ కెమెరాతో నిర్మానుష్య ప్రదేశాలను పరిశీలించి, మద్యం సేవించే ప్రాంతాలను గుర్తించారు. ఆ ప్రాంతాల్లోని చెల్లచెట్లు, గాజు సీసాలు, వ్యర్థాలను ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారితో రోడ్లపై వెళ్లే ప్రజలు ప్రధానంగా మహిళలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రతిఒక్కరికీ ఉండాలి



కనకదుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

ముండ్లమూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ విగ్రహానికి శనివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ముండ్లమూరు గ్రామస్థులతో పాటు మండల ప్రజలకు అందించాలని ప్రార్థించారు. విజయదశమి సందర్భంగా కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించటం పట్ల టీడీపీ నాయకులను అభినందించారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు, నీటి సంఘాల అధ్యక్షులు వీరనారాయణ, కంకణాల వెంకటరావు, గుంటుపల్లి రంగనాయకులు, బేతపూడి రామారావుతో పాటు దద్దాల రామయ్య, కొండయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 11 రోజులపాటు పూజలందుకున్న అమ్మవారి విగహాన్ని గుండ్లకమ్మలో నిమజ్జనం చేశారు.

పోలీస్ ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు



వాహనదారులకు హైవే వద్ద అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్

కనిగిరి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు పోలీసుల ఆంక్షలు, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాలతో డ్రైవింగ్ నిబంధనలు అతిక్రమించిన వారికి వివిధరకాల జరిమానాలు తెలియజేస్తూ శనివారం పట్టణంలో పోలీసు వాహనంలో, ఆటోల్లో ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి, ట్రిపుల్ రైడింగ్‌కు, అధిక స్పీడుకు రూ.వెయ్యి జరిమానా విధిస్తున్నట్టు చెప్పారు. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10వేలు, మైనర్‌లు డ్రైవింగ్ చేస్తే రూ.25 వేలు వారికి, వారి తల్లిదండ్రులకు జైలుశిక్ష, జరిమానా విధించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోయినా, రిజిస్ట్రేషన్, లైసెన్స్ రెన్యూవల్ లేకపోయినా పోలీసులు విధించిన జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని కోరారు. ఈసందర్భంగా డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ పట్టణంలో వాహనదారులకు అవగాహన కల్పించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
ఆదివారం 5 అక్టోబరు 2025





అద్దంకిలో ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ వినోద్‌కుమార్

అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం

- చిత్తశుద్ధితో ఎస్సీ, ఎస్టీలకు మేలు చేయాలి
- జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం శనివారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధితులకు చట్ట ప్రకారం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. సంఘటన జరిగిన 24గంటల్లోనే కేసు నమోదు చేసి దర్యాప్తును వేగంగా పూర్తి చేయాలని పోలీసులకు సూచించారు. గడిచిన 9 నెలలో 44 కేసులు నమోదు కాగా 26 కేసులు చార్జిషీట్ వేయగా 18 కేసులు దర్యాప్తులో ఉన్నాయన్నారు. కులధ్రువీకరణపత్రాల జారీలో జాప్యం జరుగుతుందని డీఎస్పీలు, కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. 40 శాతం ఎస్సీ ఎస్టీ జనాభా కలిగిన ప్రాంతాల్లో కేసులు, హక్కులు ఉల్లంఘన జరుగుతుంటే ఆయా గ్రామాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఎస్సీఎస్టీలకు మేలు చేయడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ భూ సమస్యలు అధికంగా ఉండే గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ఎంపికైన సభ్యులు

జిల్లా స్థాయి నిఘా పర్యవేక్షణ కమిటీలో నూతనంగా దొడ్డుపోతు రాజు, ఉన్నం సుధాకర్, కె.రిబ్కా, వేము భగవాన్‌దాసు, కె.వెంకటప్రసాద్, మిల్టన్, రాజాసాల్మన్, దాసరి ఇమానీయేలను ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, కన్వీనర్ జె.రాజాదెబోరా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్, ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్



ఆటోడ్రైవర్లకు చెక్ అందజేస్తున్న బాపుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు, ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్ తదితరులు



చీరాలలో ఆటో డ్రైవర్ల సేవలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ఆటోవాలాకు ఆర్థిక దన్ను

ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభం

- ఆటోవాలాల ఖాతాలకు రూ.15 వేలు జమ
- జిల్లాలో 6,859 మందికి..రూ.10.28 కోట్ల లబ్ధి
- మోదీ, చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- ఆటోలు నడుపుతూ ర్యాలీల్లో ఎమ్మెల్యేలు.. అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా జిల్లాలో 6,859 మంది ఆటో డ్రైవర్లకు రూ.10.28 కోట్ల లబ్ధి చేకూరింది. స్త్రీశక్తి పథకం సూపర్ హిట్ కావడంతో.. ఆటో డ్రైవర్లకు ఆదా యం తగ్గింది. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని కూటమి ప్రభుత్వం శనివారం ప్రారంభిం చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు బటన్ నొక్కిన వెనువెంటనే ఒకేసారి ఆటోవాలల మొబైల్స్ మోగాయి. వారి ఖాతాలకు రూ.15 వేలు జమైనట్లు సమాచారం వచ్చింది. దీంతో ఆటోవా లాలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. జిల్లా అంతటా పం డుగ వాతావరణంలో 'ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారం భించగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కోలాహలంగా ఎమ్మె ల్యేలు, కూటమి నేతలు, అధికారులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డ్రైవర్లు ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి విజయవాడలో ఈ పథక ప్రారంభోత్స కార్య క్రమాన్ని ఎల్ఈడీ తెరల ద్వారా ఎక్కడికక్కడ నేతలు, అధికారులతో పాటు ఆటో డ్రైవర్లు వీక్షించారు. ఆటోలతో భారీ ర్యాలీలు నిర్వహించారు.



వేమూరులో ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

నియోజకవర్గ కేంద్రాల్లో సందడి..

- జిల్లా స్థాయిలో అద్దంకిలో ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవం సందర్భంగా చేపట్టిన ర్యాలీని మంత్రి కొలుసు పార్థసారథి జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి ఆటో నడపగా వెనుక సీటులో కలెక్టర్ వినోద్‌కుమార్ కూర్చు న్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ కూటమి ప్రభుత్వం సమానంగా చేస్తుందని తెలిపారు. ఆటో డ్రైవర్లకు పోలీసుల వేధింపులు ఉండవని, డ్రైవర్లకు ఇబ్బంది కలిగించే జీవోలను రద్దు చేస్తామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం సూపర్‌గా అమలు చేస్తుందని, వైసీపీ నేతల అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోరారు. అర్హత ఉండి నగదు జమ కాని వారు వివరాలు ఇస్తే వారికి పథకం వర్తింప చేస్తామని కలెక్టర్ తెలిపారు.
- బాపట్ల కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా చీలురోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ఆటోలతో ర్యాలీ జరిగింది.
- వేమూరులో బస్టాండ్ సెంటర్ నుంచి ఆటోడ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆటో నడిపారు.
- చీరాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు.
- రేపల్లెలో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆటోడ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు.
- పర్చూరు పంచాయతీ కార్యాలయంలో టీడీపీ నేతలు ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని డ్రైవర్లతో కలిసి ప్రారంభించారు.

సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు తరగతులు

బాపట్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో శనివారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ మురళి కృష్ణతో కలిసి బాపట్ల, చీరాల, ట్రేడర్స్ అసోసియేషన్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో తరగతి గదుల కార్యక్రమాన్ని ఈ నెల 7న, బాపట్ల షాపింగ్ ఫెస్టివల్‌ను 19న నిర్వహించాలన్నారు. ఈ నెల 11 నుంచి 18 వరకు షాపింగ్‌కు వచ్చే ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏ వస్తువుపై ఎంత ధర తగ్గిందనే వివరాలను వినియోగదారులకు వ్యాపారులు తెలియజేయాలన్నారు. ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని నోడల్ అధికారి యశ్వంత్‌ను ఆదేశించారు. సమస్యలు ఉంటే గ్రూప్ ద్వారా తెలియజేయాలని అసోసియేషన్ సభ్యులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఈవో ఎస్.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌డీవో ప్రక్షాళన

- డివిజన్ల వారీగా కార్యాలయాలు, సిబ్బంది కేటాయింపు
- పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు
- గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర దిశగా అడుగులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బాపట్ల డివిజన్ డీఎల్‌డీవో కార్యాలయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):

వైసీపీ హయాంలో మొక్కుబడి తంతుగా ఏర్పాటు చేసిన విభాగాల్లో డీఎల్‌డీవో వ్యవస్థ ఒకటి. రెవెన్యూ డివిజన్‌ల వారీగా 2020లో డీఎల్‌డీవో(డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)లను అప్పటి ప్రభుత్వం కొలువుదీర్చింది. గ్రామాలను ప్రగతి బాట పట్టించడంలో అత్యంత కీలకంగా వీరు వ్యవహరించనున్నారని ప్రచార ఆర్భాటానికి తెరతీసింది. కానీ, నాలుగేళ్ల పాలనలో కనీసం వారికి సొంత కార్యాలయాలు, సిబ్బందిని నియమించడం లేకపోగా.. కనీసం వారి విధులపై కూడా స్పష్టత లేకుండా వైసీపీ ప్రభుత్వం ఒక ప్రహసనంలా మార్చేసింది. కూటమి ప్రభుత్వం సదరు వ్యవస్థ ప్రక్షాళనపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగానే పంచాయతీరాజ్ అధికారులు గడచిన మూడు నెలలుగా డీఎల్‌డీవో అధికారులకు కేటాయించాల్సిన విధులపై స్పష్టతతో పాటు, జడ్పీ కార్యాలయాలతో వీరిని అనుసంధానం చేయడంపై కసరత్తు చేశారు. డీఎల్‌డీవోలకు ప్రత్యేకంగా కార్యాలయాలు ఏర్పాటు చేసి, సిబ్బందిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

పూర్తి ప్రక్షాళన

బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని డీఎల్‌డీవో విభాగాలు సరికొత్తగా దర్శనమివ్వబోతున్నాయి. దాదాపు ప్రతి డివిజన్‌లోనూ డీఎల్‌డీవోల కోసం ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేశారు. బాపట్ల డీఎల్‌డీవో కార్యాలయం కోసం ఏజీ కళాశాల రోడ్డులోని పాత మీ-సేవ కార్యాలయ భవనాన్ని సిద్ధం చేశారు. కలెక్టరేట్‌లో నరసరావుపేట డీఎల్‌డీవో (మిగతా 8వ పేజీలో)

జిల్లాల వారీగా డివిజన్లు

బాపట్ల జిల్లాలో బాపట్ల, చీరాల, రేపల్లె, పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి, నరసరావుపేట, గురజాల, గుంటూరు జిల్లాలో తెనాలి, గుంటూరు డివిజన్లకు డీఎల్‌డీవోల నియామకం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్ పరిధిలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, జడ్పీ నిధులను సమర్థంగా వినియోగించుకుని పల్లెలను అభివృద్ధి బాట పట్టించడం డీఎల్‌డీఓ విధులు. డ్వామా వంటి కీలక విభాగాలతో సమన్వయం చేసుకుని మెరుగైన ఫలితాలు చూపెట్టడం వారి విధుల్లో కీలకం. కానీ, వైసీపీ ప్రభుత్వం వారిని కేవలం అలం కారప్రాయంగా మార్చేసి.. నియామకాల ఉద్దేశాన్నే దాదాపుగా నీరుగార్చేసింది. ఒక్క డివిజన్‌లో కూడా ప్రత్యేక కార్యాలయం అన్న ఊసే లేకుండా చేసింది. ఎంపీడీవో కార్యాలయాల్లో నామమాత్రంగా డీఎల్‌డీవోలకు ఓ గది కేటాయించి.. మమ అనిపించింది.

సీనరేజ్ వసూళ్లలో ఇబ్బంది పెడితే సహించం

▸▸ గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం హెచ్చరిక

బల్లికురవ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమల నుంచి ఇష్టారీతిన సీనరే జ్ వసూళ్లు చేపడితే సహించేది లేదని అవసరమైతే ఆందోళనకు దిగుతామని గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం మండల అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య హెచ్చ రించారు. శనివారం వేమవరంలో జరిగిన గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సమావే శంలో ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లాలో మాదిరిగా ఇక్కడ కూడా ఏఎంఆర్ కంపెనీ సీనరేజ్ వసూళ్లు చేపడితే పరి శ్రమలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. నిర సనగా ఫ్యాక్టరీలు మూత వేయాలని కొంద రు నిర్ణయించగా, అసలు సీనరేజ్ ఎలా వసూలు చేస్తారో వేచి చూద్దామని మరి కొందరు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సీనరేజ్ వసూళ్ల తీరు చూసి తదుపరి ఆం దోళనలు చేపట్టాలని సమావేశంలో యజమానులు నిర్ణయించారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు సుధాకర్, శ్రీనాథ్, వేణు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం అధ్యక్షుడు మస్తానయ్య

చెక్‌పోస్టుల ఏర్పాటులో ఏఎంఆర్ కంపెనీ

క్వారీలు, ఫ్యాక్టరీలు ఉన్న ప్రాంతాలలో ఏఎంఆర్ కంపెనీ నిర్వాహకులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నగదు వసూళ్లకు సంబంధించి ఎక్కడికక్కడ సిబ్బందిని కూడా నియమించారు. రెండు మూడు రోజుల్లో సీనరేజ్ వసూలు చేయాలని కంపెనీ నిర్వాహకులు నిర్ణయించి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే వసూళ్లలో తమకు ఇబ్బంది కలిగితే స్వచ్ఛందంగా పరిశ్రమలను మూత వేసి నిరసన చేపట్టేందుకు ఫ్యాక్టరీల యజమానులు నిర్ణయించుకున్నారు. అలానే సమస్యలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకు వెళ్లాలని వారు నిర్ణయించుకున్నారు.

కాలుష్యం.. కాటేస్తోంది

సండే స్పెషల్

- ముంచుకు వస్తోన్న ముప్పు
- ప్రమాదం అంటున్నా ప్రజల్లో నిర్లక్ష్యం
- ఢిల్లీ పరిస్థితులను చూసి మేల్కోని జనం
- ప్రభుత్వ కృషికి ప్రజా సహకారం ఉంటేనే కట్టడి

పొగ చూరిన గాలి.. రణగొణ ధ్వనులతో పాటు ఆహారం, నీరు, భూమి, దేహం అంతటా కాలుష్యమే. స్వచ్ఛమైన గాలి ఇటు గుంటూరు నగరం నుంచి మారుమూల పల్లె వరకు ఎక్కడా అందడంలేదు. దుమ్ము, ధూళి, దుర్వాసనతో కూడిన గాలి అంతటా నిండిపోయింది. రవాణా, గృహ నిర్మాణాలు, పరిశ్రమల కార్యకలాపాలతో అటు వాయు, ఇటు ధ్వని కాలుష్యాలు ప్రజల ప్రాణాలను తీస్తున్నాయి. కాలుష్యం కాటేస్తున్నా ప్రజలు నిర్లక్ష్యం వీడటంలేదు. ప్రమాదం ముంచుకువస్తోంది.. జాగ్రత్త అని పర్యావరణవేత్తలు, ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా.. నా ఒక్కడితో ఏమవు తోంది.. నేనొక్కడినే మారాలా.. అనే ధోరణితో ఇటు ప్రజలు, లాభార్జన యావలో వ్యాపారులు కాలు ష్యాలను నానాటికీ పెంచుకుంటూ వెళ్తున్నారు. వాయు, ప్లాస్టిక్ కాలుష్యాలతో క్యాన్సర్ తదితర ప్రాణాంతక జబ్బులు ఇప్పటికే పెరిగిపోయాయి. కాలుష్యాలతో డేంజర్ జోన్‌లోకి వెళ్లిన ఢిల్లీలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితులు నెలకొన్నాయని తెలిసి కూడా ప్రజలు నిర్లక్ష్యం వీడ టంలేదు. ఇప్పటికైనా కళ్లు తెరిచి కాలుష్య కారకా లను కట్టడి చేసి, పర్యావరణాన్ని సంరక్షించడంలో మనవంతుగా ఎవరికివారు కలిసికట్టుగా కృషి చేయకపోతే భావితరాలకు తీరని అన్యాయం చేసిన వారమవుతాం.

వివరాలు 8లో..







శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న చుండూరి మురళీసుధాకరరావు, సభ్యులు

శింగరకొండ అభివృద్ధికి కృషి

ప్రమాణ స్వీకారంలో చైర్మన్ చుండూరి

అద్దంకి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):అందరి సహకారంతో శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు తెలిపారు. చైర్మన్‌తో పాటు సభ్యులు నూతి లక్ష్మీప్రసాద్, ఆకుల కోటేశ్వరమ్మ, బత్తుల చంద్రశేఖర్, మద్దా సునీత, ఏల్చూరి వెంకటనారాయణమ్మ, ధూళిపాళ్ల వెంకటరత్నం, గొర్రెపాటి పద్మజ, అరబోలు నాగమ్మ, దేవరపల్లి సురేష్‌బాబు, కోనంకి సుబ్బారావు, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా కోట లక్ష్మీనారాయణల చేత ఈవో, అసిస్టెంట్ కమీష నర్ తిమ్మానాయుడు శనివారం ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లా డుతూ భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి పాలకమండలి సభ్యులు తొలుత అద్దంకి నుంచి ర్యాలీగా శింగరకొండకు చేరుకున్నారు. 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, ప్రసన్నాంజనేయస్వామి దేవాల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయం ఈఓ మద్దినేని శ్రీనివాసరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

అథ్లెటిక్స్‌లో కడవకుదురు విద్యార్థిని ప్రతిభ

● జావలిన్ త్రోలో బంగారు పతకంతో మెరిసిన ఐశ్వర్య



ఐశ్వర్యను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చినగంజాం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మున్నం ఐశ్వర్య రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో బంగారు పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్రా రామారావు పాఠశాల ఆవరణలో శనివారం ఉదయం జరిగిన అసెంబ్లీలో ఆమెను సన్మానించి అభినందించారు. పాఠశాలలో ఐశ్వర్య పదో తరగతి చదువుతున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. సెప్టెంబరు 26వ తేది నుండి 28వ తేది వరకు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో ఐశ్వర్య పాల్గొన్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్‌లోని జావెలిన్ త్రోలో బంగారు పథకం సాధించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపిన ఐశ్వర్యను ఈ నెల 10వ తేదీ నుంచి 4వ తేది వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే 40వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2025 పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్ఎస్ఐ అథ్లెటిక్ కోచ్ కుక్కల అనంతకుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిదంబరేశ్వరస్వామికి సూర్యకిరణాభిషేకం



చిదంబరేశ్వరస్వామిని తాకిన సూర్యకిరణాలు

చినగంజాం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : చినగంజాంలోని గంగా పార్వతి సమేత చిదంబరేశ్వరస్వామి దేవస్థానంలోని శివలింగాన్ని శనివారం సూర్యదయ వేళ కొన్ని నిమిషాల పాటు భానుని లేలేత కిరణాలు తాకాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి కొల్లిపర అప్పారావు మాట్లాడుతూ అశ్వయుజ మాసం, మాఘమాసాలలో సూర్య కిరణాలు స్వామి వారిని అభిషేకిస్తుంటాయన్నారు. శనివారం ఉదయం 6.50 గంటల నుండి పది నిమిషాల పాటు స్వామి వారి లింగాకారాన్ని భానుడి కిరణాలు తాకినట్లు తెలిపారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యకిరణాలు స్వామి వారిని అభిషేకించే దృశ్యాన్ని భక్తులు తిలకించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మరో పది రోజుల పాటు స్వామి వారిని సూర్యకిరణాలు తాకుతున్నాయని ఆలయ పూజారి తెలిపారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి నగరోత్సవం



అద్దంకిలో అమ్మవారికి విశేష అలంకరణ, హాజరైన భక్తులు

అద్దంకి, అక్టోబరు4: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల ముగింపులో భాగంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం శనివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో 54వ శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. శనివారం రాత్రి దేవాలయం వద్ద రథోత్సవము ప్రారంభం సందర్భంగా ఛైర్మన్ వూటుకూరు రామకోటేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాలు, కళాకారుల నృత్యాలు మధ్య అమ్మవారి నగరోత్సవం సాగింది. మెయిన్‌రోడ్డు, పాతబస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, భవానిసెంటర్, పాతగాంధీబొమ్మ సెంటర్ మీదుగా రథోత్సవము ఉత్సాహంగా సాగింది. ఛైర్మన్ వూటుకూరి రామకోటేశ్వరరావు, చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు,అర్వపల్లి హనుమంతరావు, నేరేళ్ళ శ్రీనివాసరావు,పోకూరి శ్రీనివాసరావు ల ఆధ్వర్యంలో రథోత్సవము సాగింది. ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

మార్టూరు, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా అమ్మ ఆశ్రమంలో శనివారం హైదరాబాదుకు చెందిన మైనేని విఠల్ సంధ్యారాణి దంపతులు పేదలకు వృద్ధులకు దుప్పట్లును పంపిణీ చేశారు. అనంతరం వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమం అధ్యక్షులు చందు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి కొలుసు పార్థసారధి



ర్యాలీ ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారధి

అద్దంకిటౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆటోడ్రైవర్ల సేవ'లో కార్యక్రమం అద్దంకిలో నిర్వహించగా ముఖ్య అతిథిగా మంత్రి పార్థసారధి, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌లు హాజరై జండా ఊపి ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో ఆటోర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆటోలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఇతర అధికారులను ఎక్కించుకుని నడుపుకుంటూ ఎస్సీ కన్వెన్షన్ వరకు వెళ్లారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పథకం ప్రారంభించే కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా వీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2,90,669 మంది ఆటో డ్రైవర్లుకు ఏటా 436 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఈ పథకం కింద ప్రతి ఆటోడ్రైవర్‌కు రూ.15 వేలు చొప్పున వారి ఖాతాలల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికి జిల్లాలో 6859 మంది లబ్ధిదారులకు 10,28,85,000 కోట్ల రూపాయాలు ఖతాలల్లో జమ చేయడం జరిగిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను పంపిణి చేశారు. ఇకపై ఆటో డ్రైవర్లకు పోలీసుల వేధింపులు ఉండవన్నారు. ఆటోడ్రైవర్లకు ఇబ్బంది కలిగించే జీవోలను రద్దు చేస్తామన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. యువతలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి 20 లక్షల మందికి ఉద్యోగాలను కల్పించడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ఇటివలే స్త్రీశక్తి పథకం అమలుచేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణాధికారి టి.కృష్ణ పరందామ రెడ్డి, ఆర్‌డీవో తూమాటి చంద్రశేఖర్‌నాయుడు, డీఎల్‌డీవో విజయ లక్ష్మి, ఏపీడీ బత్తిన సింగయ్య, వ్యవసాయ కార్పోరేషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ, అద్దంకి, సంతమా గులూరు ఏఎంసీ ఛైర్మన్‌లు వరగాని పద్మవతి, తేళ్ల ప్రోలు రమేష్, స్వచ్ఛంద్ర కార్పోరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మందా నాగేశ్వరరావు, పెంట్యాల రామాంజనేయులు, వడ్లవల్లి పూర్ణచంద్రరావు, ఎం.త్రిమూర్తులు, రంగిశెట్టి సాంబశివరావు(లహరి), ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నాగిపోగు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ఆటోడ్రైవర్ల సేవలో ఎమ్మెల్యే

చీరాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోడ్రైవర్ సేవలో కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆటో డ్రైవర్లు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొని స్వయంగా ఆటో నడిపి అందరినీ ఉత్సాహ పరిచారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆటో అన్నలకు వాహనమిత్ర ద్వారా రూ.10 వేలు ప్రకటించినప్పటికీ, అమలులో చిత్తశుద్ధి లేదన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం రూ.15 వేలకు పెంచి అమలులో స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అలాగే జిల్లా చేనేత, జౌళిశాఖ శాఖా కార్యాలయంలో వస్త్రాలపై జీఎస్టీ భారం తగ్గించిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం

యద్దనపూడి,(మార్టూరు)అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో శనివారం ఆటోడ్రైవర్లు ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆటోలతో వచ్చిన డ్రైవర్లు నివాళులు అర్పించారు. ఆటో డ్రైవర్ల సేవద్వారా పథకం ద్వారా తొలివిడత గ్రామంలోని 10 మందికి నగదు వారి ఖాతాలలో జమఅయ్యింది. దీంతో వారు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాముల రమేష్, దేవరపల్లి కోటయ్య, కూరాకుల వీరాస్వామి, తాళ్లూరి సుబ్బారావు టీడీపీ నాయకులు తారకరామారావు, కొరటాల వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుంజి వెంకట్రావు అన్నారు. 'ఆటోడ్రైవర్ల సేవలో ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం కూటమి నాయకులు ప్రారంభించారు. ముందుగా నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి నేతృత్వంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బొమ్మల కూడలి నుంచి పంచాయితీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్లు షేక్.షంషుద్దీన్, తిరుములశెట్టి శ్రీహరి, కారుమంచి కృష్ణ, కోడూరి శేషుబ్రహ్మచారి, మండలపార్టీ అధ్యక్షులు ఎన్.రంగయ్య చౌదరి, పొద వీరయ్య, టి.నాగేశ్వరరావు, విన్నకోట అజేయ్, పట్టణపార్టీ అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, మామిడిపాక హరిప్రసాద్, ఎంపీడీవో ప్రద్యూమ్నకుమార్, మోటార్ వెహికల్ ఆఫీసర్ రవి నాయక్, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.వెంకటసామి, పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీను (గ్యాస్) షేక్.గౌస్ భాషా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం.. కాటేస్తోంది

(5వ పేజీ తరువాయి)

గుంటూరు(తూర్పు), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాలుష్యం కంటికి కనబడదు. కానీ పెనుభూతంలా మారి మనల్నే మింగేస్తోంది. కళ్లెదుట ఢిల్లీ ఓ ప్రత్యక్ష ఉదాహరణ. రాత్రికిరాత్రే ఢిల్లీ కాలుష్యం కోరల్లో చిక్కుకోలేదు. సరైన చర్యలు లేకపోవడం.. ప్రజల్లో నిర్లక్ష్యం.. వంటి కారణాలతో ఢిల్లీవాసులు ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నారు. ఢిల్లీ అంతటి పరిణామాలు ప్రస్తుతం జిల్లాలో కనిపించకపోయినా భవిష్యత్తులో ముప్పు ముంచుకు వస్తోందని తెలుస్తోంది. గాలి కాలుష్యంతో పాటు ప్లాస్టిక్, ఈ-వ్యర్థాలు ఇటు మానవుల ఆరోగ్యం, అటు పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్నాయి. ప్రస్తుతం పెరిగిపోతున్న క్యాన్సర్ తదితర జబ్బులే ఇందుకు ఉదాహరణగా కనిపిస్తున్నాయి. ఇష్టం వచ్చినట్లుగా వినియోగిస్తున్న ప్లాస్టిక్‌తో కాలుష్యం నానాటికీ పెరిగిపోతోంది. ప్లాస్టిక్ గాలిలో, నీటిలో, ఆహారంలో కలిసి ప్రాణాలను తీస్తోంది. అయినా ప్రజలు నిర్లక్ష్యం వీడటంలేదు. ప్రస్తుతం జిల్లాలో ఏడాదికి 7 శాతానికి పైగా ఈ-చెత్త వస్తుందని గణాంకాలు చెబుతున్నాయి. ఇది 16-20 శాతానికి పెరిగితే ఈ-స్క్రాబ్ ఎమర్జెన్సీ ప్రకటించే అవకాశం ఉంటుంది. కాబట్టి దీనిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలుష్యం కట్టడికి ప్రభుత్వ యంత్రాంగం కృషితో పాటు, అదే స్థాయిలో ప్రజలు సహకరించాలి. లేకపోతే స్వచ్ఛత, కాలుష్యం వంటి విషయాల్లో పరిష్కారం దొరకదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఈ- చెత్తతో.. ఎండలు మండే

ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో ఇళ్లలో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎలక్ట్రానిక్ పరికరాలను ఇష్టారీ తిన వినియోగిస్తున్నారు. చెడిపోయిన తర్వాత వాటిని చెత్తలో వేస్తున్నారు. దీంతో ఈ-చెత్త (ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలు) పెనుముప్పు గా మారుతోంది. ఇళ్లలో, రోడ్లపై, కాల్వల్లో, నదుల్లో, సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలకు మించి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఈ-చెత్తతో గతంలో కంటే ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు రెండు శాతం మేర పెరగనున్నాయని వాతావరణ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ-చెత్త వ్యర్థాలపై అవగాహన, సైక్లింగ్ పరిశ్రమల స్థాపన వంటి విషయాలపై విజయవాడ, గుంటూరు నగరాల్లో అనేక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా కార్యరూపం దాల్చలేదు.

గుంటూరులో గాలి కాలుష్యం

దేశవ్యాప్తంగా అధికంగా కాలుష్యం నమోదయ్యే 132 నగరాల్లో గుంటూరు కూడా ఒకటి. పరిశ్రమలు, గృహ, శబ్ధ కాలుష్యాలు పెద్దగా లేకపోయినా వాయు కాలుష్యం వల్లే ఈ జాబితాలో గుంటూరు చేరింది. కాలం చెల్లిన వాహనాలతో నగరానికి ఈ పరిస్థితి వచ్చిందని కేంద్ర కాలుష్య నియంత్రణ సంస్థ తన నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం గుంటూరులో వాయు కాలుష్యం 65-67 మైక్రోగ్రామ్స్ క్యూబిక్ క్యూడ్(ఎంజీ క్యూక్యూ)గా మధ్య నమోదవుతుంది. 60 ఎమ్‌జీ క్యూక్యూ కంటే తక్కువగా ఉంటే సాధారణస్థితి. అయితే 2015లో గుంటూరులో వాయు కాలుష్య శాతం 63 ఎమ్‌జీ క్యూక్యూగా నమోదైనట్లు గణంకాలు చెబుతున్నాయి. అప్పట్లో దీనిపై జిల్లా ఉన్నాతాధికారులు అత్యవసర సమావేశం నిర్వహించి ఎట్టి పరిస్థితిల్లో 2019 నాటికి వాయు కాలుష్య శాతాన్ని 58 ఎమ్‌జీ క్యూకూ తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ అది నేటికి కార్యరూపం దాల్చలేదు.

ఆరోగ్యంపై.. తీవ్ర ప్రభావం

- కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలతో జంతువులతో పాటు, మానవాళి ఆరోగ్యానికి పెను ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఊపిరితిత్తులతో పాటు ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుంది.
- ప్లాస్టిక్‌ను కాలిస్తే డయాక్సిన్, ఫ్యూరాన్ విషవాయువులు క్యాన్సర్‌ను కలగజేస్తాయి.
- రంగుల సంచుల తయారీలో వాడే సీసం, క్యాడ్మియం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. సీసం పిల్లల పెరుగుదల, జ్ఞాపకశక్తిని హరిస్తోంది. క్యాడ్మియం కిడ్నీలను దెబ్బతీస్తుంది.
- ప్లాస్టిక్ కవర్లు, బాక్సుల్లో వేడి ఆహార పదార్థాలను నిల్వ చేస్తే ప్రమాదకరమైన ప్లాస్టిక్ గ్రాన్యుల్ పిగ్మంట్లు ఆయా పదార్థాల్లో కలసి క్యాన్సర్‌కు దారి తీస్తాయి.
- ప్లాస్టిక్ వ్యర్థాల పునర్ వినియోగ ప్రక్రియలో వెలువడే క్లోరినేటెడ్ హైడ్రోకార్బన్లు కేంద్రనాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి.
- ఈ-చెత్త వల్ల మానవ ఎదుగుదల లోపాలు, బుద్ధిమాంద్యం, రోగనిరోధక వ్యవస్థను బలహీనం చేస్తోంది. గుండె, కిడ్నీల అవయువాల పనితీరు దెబ్బతీస్తోంది.

'డీఎల్‌డీవో' ప్రక్షాళన!

(5వ పేజీ తరువాయి)

కార్యాలయం ముస్తాబైంది. ఒక్కో కార్యాలయంలో కనీసం 8 నుంచి 12 మంది వరకు సిబ్బంది విధులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇక కార్యాలయాల మరమ్మతులు, ఫర్నీచర్, మౌలిక వసతుల కల్పనకు ఉమ్మడి జిల్లా జడ్పీ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు సమాచారం. పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి ఇటీవలే ప్రభుత్వం వివిధ విభాగాల అధికారుల హోదాపై స్పష్టత ఇస్తూ గెజిట్ కూడా విడుదల చేసింది. దానిలో డీఎల్‌పీవో, ఎంపీడీవోలుగా పనిచేస్తున్న వారు పదోన్నతిపై డీఎల్‌డీవోలు అవుతారని స్పష్టం చేసింది

సమర్థవంతంగా వినియోగించుకోవడానికి...

డీఎల్‌డీవో వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్ది.. డివిజన్ స్థాయిలో జరిగే ప్రతి పనిపై వారి పర్యవేక్షణ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఫలితాల విషయంలో కూడా వారినే జవాబుదారీ చేయడం వల్ల పల్లెపనుల్లో వేగం పెంచవచ్చనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఇందు కోసమే డివిజన్ స్థాయిలో రెవెన్యూ అధికారితో సమానంగా డీఎల్‌డీవోలకు కూడా ప్రత్యేక కార్యాలయం, సిబ్బందిని సమకూర్చి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది.

ఉమ్మడి జిల్లాలు కేంద్రంగానే...

జిల్లాల పునర్విభజన జరిగి మూడేళ్లు దాటినా జడ్పీ విభాగం మాత్రం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతోంది. ప్రభుత్వం డీఎల్‌డీవోల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలనే నిర్ణయానికి వచ్చినప్పటికీ సత్వర నిర్ణయాల విషయంలో జడ్పీ సీఈవో ఆదేశాలే అంతిమం కానున్నాయి. నిధుల కేటాయింపు విషయంలో కొత్త జిల్లాల్లోని డివిజన్లకు కొన్ని చిక్కుముళ్లు ఎదురవుతున్నాయి. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత నివ్వడం వల్ల జిల్లాల వారీగా కొత్తగా కొలువుదీరే జడ్పీల్లో డీఎల్‌డీవోల ప్రాముఖ్యం మరింతగా పెరగనుంది.

ఆలనాపాలనా కరువై..!

● వృద్ధుడిని ఆస్పత్రి ప్రాంగణంలో వదిలి వెళ్లిన కుమారుడు

● ఆయన వస్తాడని 25 రోజులుగా పడిగాపులు

● పెద్దవడ్లపూడిలో ఇంటికి తీసుకెళ్లమని విలపిస్తున్న తండ్రి



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న తండ్రి బాషా

చీరాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : వృద్ధాప్యంలో ఉన్న ఆయనకు నేడు ఆలనా పాలన కరువైంది. కన్న కుమారుడే ఆ వృద్ధుడిని చీరాల వైద్యశాల ప్రాంగణంలో వదిలి వెళ్లడంతో 25 రోజులుగా ఆయన తల్లడిల్లుతున్నాడు. తనను పెద్దవడ్లపూడిలోని తన ఇంటికి చేర్చాలని ఆయన విలపించడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది. బాధితుడి కథనం మేరకు.. గుంటూరు జిల్లా పెదవడ్లపూడికి చెందిన బాషాఖాన్ వృద్ధాప్యంలో ఉన్నాడు. ఈక్రమంలో ఏసీ మెకానిక్ పనిచేస్తున్న కుమారుడు అబ్దుల్ హుస్సేన్‌సాబ్ 25 రోజుల క్రితం బాషాఖాన్‌ను చీరాలకు తీసుకొచ్చాడు. ఇక్కడి వైద్యశాలలో చూపిస్తానని చెప్పి, ప్రాంగణంలోని మెట్లు వద్ద కూర్చొబెట్టాడు. లోనికి వెళ్లి ఓపీ రాయించుకొని వస్తా నని చెప్పి వెళ్లాడు. ఆ రోజు నుంచి కొడుకు కనిపించలేదు. దీంతో కుమారుడి కోసం చుట్టుపక్కల వెదికీ దిక్కుతోచని స్థితిలో తండ్రి విలపిస్తున్నాడు. అయితే ఆస్పత్రి ప్రాంగణంలో స్వచ్ఛంద సంస్థలు అన్నదానం చేస్తుండడంతో ఎలాగోలా నెట్టుకొస్తున్నాడు. రాత్రిళ్లు అరుగులపై పడుకుని రాత్రంతా ఏడుస్తున్నట్లు సిబ్బంది, రోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా తనను కుటుంబం చెంతకు చేర్చాలని ఆయన విలపిస్తున్నాడు.

మూడు కోడిపుంజులు చోరీ

బల్లికురవ, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): విలువైన మూడు కోడిపుంజులు అపహరణకు గురైన ఘటన మండల కేంద్రం బల్లికురవలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన పావులూరి సుబ్బారావు అను రైతు చెరువు అలుగు వద్ద హోటల్ నిర్వహిస్తున్నాడు. అక్కడ కోడి పుంజులను పెంచుతున్నాడు. గదిలో ఉంచిన కోడి పుంజులను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. చోరీకి గురైన కోడిపుంజుల విలువ సుమారు రూ.50 వేల పైన ఉంటుందని బాధితుడు వాపోతున్నాడు. జాతిపుంజులు కావడంతో ఎంతో ఇష్టంగా పెంచుతున్నానని ఎవరో కాపు కాసి చోరీ చేశారని ఆయన వాపోయాడు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి చేయూత

యద్దనపూడి,(మార్టూరు)అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎస్‌కే సుభానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేయూతనందించింది. ఆయన ఇంటికి వెళ్లి కమిటి సభ్యులు రూ.7 వేల నగదు , 25 కిలోలు బియ్యం, నిత్యావసర వస్తువులను అందచేశారు. అనంతరం ఆయన ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పఠాన్ ఖాదర్‌వలి, కేబుల్ బాషా, పుట్టా అయ్యప్పస్వామి, సుభాని, కరీం తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి సేవ చేయడమే ధ్యేయం

● డాక్టర్ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్‌కుమార్

అద్దంకి, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గ ప్రజలకు సేవచేయడమే ధ్యేయం అని వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితుడైన డాక్టర్ అశోక్‌కుమార్ శనివారం తనపుట్టిన రోజు సందర్భంగా పిడుగురాళ్ల నుంచి సంతమాగులూరు అడ్డరోడ్డు మీదుగా శింగరకొండకు ర్యాలీగా చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కూకట్ల కన్వెన్షన్‌లో జరిగిన పుట్టిన రోజు వేడుకలలో డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడారు. అద్దంకి నియోజకవర్గంలో వైద్యం, విద్య, ఉపాది, మహిళాసాధికారిత కల్పన కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నాగార్జున, మాజీ ఎంపీ సురేష్, నర్సరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తూమాటి మాధవరావు, గౌతంరెడ్డి, స్థానిక వైసీపీ నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రీయ రహదారిపై వైదన వద్ద ఉద్రిక్తత

● వైసీపీ శ్రేణులు ర్యాలీ రావడంతో అడ్డుకొన్న పోలీసులు

● వాగ్వాదానికి దిగిన నేతలు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న వైసీపీ నేతలు

బల్లికురవ, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాష్ట్రీయ రహదారి వైదన గ్రామం వద్ద శనివారం వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా రావడంతో పోలీసులు వారిని నియంత్రించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా చింతలపూడి అశోక్ కుమార్ బాధ్యతల స్వీకారం కార్యక్రమం నిర్వహించనుండడంతో పలు గ్రామాల నుండి వైసీపీ శ్రేణులు అద్దంకి వైపు వచ్చాయి. అద్దంకిలో ఇన్‌చార్జి మంత్రి కార్యక్రమం జరుగుతుండడంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు వైదన గ్రామం వద్ద వైసీపీ శ్రేణుల వాహనాలను నిలిపివేశారు. దీంతో వారు పోలీసులతో వాదనకు దిగారు పోలీసులు పలు దఫాలుగా వాహనాలను వదిలిపెట్టారు. వైసీపీ శ్రేణులు మాత్రం తమ ర్యాలీని అడ్డుకొన్నారని ఆరోపించగా పోలీసులు మాత్రం శాంతి భద్రతల నేపథ్యంలోనే నిలిపివేసినట్లు తెలిపారు.

శ్రీశైలం ఆలయ కమిటీ సభ్యునిగా అనిల్‌కుమార్



అనిల్‌కుమార్

పర్చూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవక్షేత్రం(శ్రీశైలం) ఆలయ కమిటీ సభ్యునిగా (డైరెక్టర్) పర్చూరుకు చెందిన ఆలా అనిల్ కుమార్ నియమితులయ్యారు. దీంతో ఆయన్ను పలువురు అభినందించారు. పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన పార్టీలో కీలక నేతగా ఉంటూ పార్టీ బలోపేతానికి ఎనలేని కృషిచేస్తున్నారు. అనిల్ సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం పదవి లభించేలా చొరవ చూపింది.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనే పేరొందిన ప్రముఖ ఆలయానికి డైరెక్టర్ పదవి దక్కడంపై జనసేనికులు ప్రజాకూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యునిగా నియమించినందుకు రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్, రాష్ట్ర పౌరశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కూటమి ప్రభుత్వం గొప్ప అవకాశం అందించింది

● విలేకరుల సమావేశంలో జనసేన నేత అనీల్‌కుమార్


● సమావేశంలో ఆందోళన వ్యక్తం చేసిన మరోవర్గం

చీరాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పరమాత్మునికి సేవ చేసుకునే భాగ్యం కూటమి ప్రభుత్వం కల్పించిందని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అరుదైన గౌరవం అందించారని పర్చూరు జనసేన నాయకులు అలా అనీల్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా శ్రీశైలం పాలక మండలి సభ్యుడిగా ఆయనను నియమించింది. పర్చూరు నుండి అనీల్‌ను, అలాగే శ్రీకాళహస్తీ దవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులుగా టీడీపీ నుంచి చీరాలకు చెందిన కొమ్మనబోయిన రజనీకు పదవులు కల్పిస్తు ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో శనివారం చీరాల ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించిన అనీల్ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట లక్ష్మీనారాయణ, పసుపులేటి సాయి, కారంపూడి పద్మినీ, మల్లీశ్వరీ ఉన్నారు. అయితే అదే సమయంలో చీరాల జనసేన నేతలు గూడూరు శివరామప్రసాద్, తోట రాజశేఖర్ మరి కొందరు అక్కడికి చేరుకుని సమావేశాన్ని వ్యతిరేకించారు. పార్టీలో కీలకంగా పనిచేసిన వారికి ప్రాధాన్యత కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చీరాలకు సంబంధం లేని వారు ఇక్కడ సమావేశాలు నిర్వహించడంపై బహిరంగంగానే ఆక్షేపించారు.

జీఎస్‌టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు

పంగులూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు కలుగుతుందని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. పంగులూరు వెలుగు కార్యాలయంలో శనివారం జీఎస్టీ తగ్గింపు సూపర్ సేవింగ్స్‌పై వీవోఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ వైద్యసేవలపై పన్ను భారం పూర్తిగా తగ్గించడంతో వైద్యఖర్చుల భారం తగ్గనుందన్నారు. జీఎస్టీ తగ్గింపు వలన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయని, వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన ఉపకరణల ధరలు తగ్గి రైతాంగానికి మేలు కలుగుతుందన్నారు. ఏపీఎం. కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్, మండల సమాఖ్య కార్యదర్శి కమలకుమారి , వీవోఏలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
ఆదివారం 5 అక్టోబరు 2025



డీసీపల్లిలో పొగాకు ధరలు



మర్రిపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 1056 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 894 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 162 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.315 కాగా, కనిష్ట ధర రూ.75లు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

'సోమశిల'కు తగ్గిన వరద

అనంతసాగరం అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శుక్రవారం 25,205 క్యూసెక్కులు వస్తుండగా శనివారానికి 17,308 క్యూసెక్కులకు పడిపోయింది. డ్యాంలో 72.532 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 11,200, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



విద్యారంగ ఆర్థిక సమస్యలపై 7న ధర్నా

కందుకూరు : విద్యారంగ ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న విజయవాడలో తలపెట్టిన ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని ఫ్యాప్టో నేతలు కోరారు. శనివారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నేతలు మాట్లాడుతూ విజయవాడకు కందుకూరు నుంచి తరలివెళ్లాలని పిలుపునిచ్చారు.

ఆటో డ్రైవర్ల సేవలో.. అట్టహాసంగా...

జిల్లాలో ప్రారంభించిన మంత్రి ఆనం, కలెక్టర్ శుక్లా

నియోజక వర్గాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు ● ఆనందోత్సాహాలతో ఆటోడ్రైవర్ల ర్యాలీలు



కావలిలో ఆటోడ్రైవర్ల ర్యాలీ

నెల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు చేయూతనిస్తూ 'ఆటో డ్రైవర్ల సేవలో..' అనే మహోత్తర పథకాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించింది. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి డ్రైవర్ బ్యాంకు ఖాతాలో రూ.15 వేల నగదును జమ చేసింది. రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించగా, నెల్లూరులో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లాలు ప్రారంభించారు. అలానే జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఆటో డ్రైవర్ల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభించారు. తొలుత ఖాకీ చొక్కాలు ధరించి, ఆటో డ్రైవర్లతో కలిసి భారీ ర్యాలీలు నిర్వహించారు.

● నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ఆర్డీవో అనూష, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకముందు ఆర్టీసీ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ జరిగింది.



కోవూరులో ఆటోవాలాల ర్యాలీ



కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

● ముత్తుకూరులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్ శివప్రసాద్‌తోపాటు కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. ముందుగా జెన్‌కో రోడ్డు కూడలి నుంచి ముత్తుకూరు ఎమ్పీడీవో కార్యాలయం వరకు ఆటోవాలాలు ర్యాలీ నిర్వహించారు.

● ఉదయ గిరిలోని గండిపాళెం సర్కిల్ నుంచి నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పట్టణ పురవీధుల గుండా ఆటో నడుపుతూ టీటీడీ కల్యాణ మండ పం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి తదితర కూటమి నాయ కులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావే శంలో లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు.

● కోవూరులో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఆగ్రోస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, ఆర్డీవో పావని పాల్గొనగా, ఆర్‌ఆర్ కాలనీ నుంచి బజారు కూడలి వరకు ఆటోలతో ప్రదర్శన నిర్వహించారు. నెల్లూరుపాలెం సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

● కావలిలో ఆటోలతో ర్యాలీ జరగ్గా ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి స్వయంగా ఆటో నడుపుకుంటూ వచ్చారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

● కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారు. టీడీపీ కార్యాలయం నుంచి మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

థాంక్యూ సీఎం సార్..

ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం అండగా నిలిచి, రూ.15,000 బ్యాంకు ఖాతాకు జమచేయటం ఆనందంగా ఉంది. థ్యాంక్యూ సీఎం సార్... అంటూ కావలి పట్టణంలోని వైకుంఠపురానికి చెందిన ఆటో డ్రైవర్ తాతా హరిబాబు ఆనందం వ్యక్తం చేశాడు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేర్చారు. ఈ నగదు వాహన నిర్వహణకు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు.



తన ఫోన్‌లో నగదు జమ అయిన మెసేజ్ చూపుతున్న తాతా బాబురావు



ముత్తుకూరులో లబ్ధిదారులకు నమూనా చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, జడ్.శివప్రసాద్ తదితరులు



నెల్లూరు నగరంలో లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి ఆనం, పక్కన కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు



ఉదయగిరిలో ఆటో నడుపుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే కంభం

కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షపాతి

17,406 మంది ఆటోడ్రైవర్లకు రూ.26 కోట్లు ● మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అనేందుకు ఉదాహరణ ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభించడమేనని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలోని ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆనం మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు అన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 17,406 మంది డ్రైవర్ల ఖాతాల్లో రూ.26 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. వీరిలో మైనారిటీస్ కార్పొరేషన్ ద్వారా 402 మందికి, వైశ్య కార్పొరేషన్ ద్వారా ఇద్దరికి, బీసీ ఎ కార్పొరేషన్ ద్వారా 2946, బీసీ బి కార్పొరేషన్ ద్వారా 1921, బీసీ డి కార్పొరేషన్ ద్వారా 1755, బీసీఈ కార్పొరేషన్ ద్వారా 2045, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 24, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 340, కమ్మ కార్పొరేషన్ ద్వారా 327, కాపు కార్పొరేషన్ ద్వారా 957, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 14, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 744, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 4,804, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 1014, ఇతరులు 11 మంది ఆటో డ్రైవర్లకు వారి ఖతాల్లోకి నగదు జమ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మరో మంచి పథకానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. అర్హత ఉన్న వాళ్లలో ఎవరైనా మిస్ అయిన వారికి సచివాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడంతోపాటు హెల్ప్‌లైన్ కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, డీటీసీ చందర్, టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





ఎరువుల వినియోగంపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, వ్యవసాయాధికారులు

లాభసాటి వ్యవసాయానికి ప్రణాళికలు

యాంత్రీకరణతో రైతులకు ఆదాయం ● కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యత ఉంది... దీనిపై ఆధారపడి ఎంతో మంది రైతులు జీవనం సాగిస్తున్నారు.. అందుబాటులో ఉన్న నూతన విధానాల అమలు ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం'.... అని కలెక్టర్ హిమాన్షుశుక్లా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో శనివారం వ్యవసాయ యాంత్రీకరణపై వర్క్‌షాపు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంలో వినూత్న విధానాలను ప్రయోగాత్మకంగా అమలు చేసి, చూపిస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఇందుకు జిల్లాలోని అన్నీ గ్రామ పంచాయితీల్లోని ఔత్సాహిక రైతులను ఎంపిక చేసి, వారిని వ్యవసాయ విజేతలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తూ సాగులో పురోగతి సాధించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపుతూ ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలన్నారు.

పూర్తిస్థాయిలో యాంత్రీకరణ

పంటల సాగులో పూర్తిస్థాయిలో యాంత్రీకరణ అమలు చేస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. పెట్టుబడులు తగ్గి ఉత్పాదకత పెరుగుతుందని, తద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను గుర్తించి, వాటిని అందించాలన్నారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి, యంత్ర పరికరాలు, వాటి అవసరాలను రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే యంత్ర పరికరాలను రైతులు ఉపయోగిస్తున్నారని, వారి అనుభవాలను కూడా తెలుసుకోవాలన్నారు. ఈసందర్భంగా యూరియా వినియోగానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, మత్స్యశాఖ అధికారి కే.శాంతి, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సత్యనారాయణ, ఆత్మ పీడీ మురళితోపాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి చూపించాకే భూసేకరణ చేపట్టండి

కావలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలు చూపించాకే భూసేకరణ చేపట్టాలని చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెం రైతులు అధికారులను కోరారు. రామాయపట్నం పోర్ట్ అనుబంధ పరిశ్రమలకు అవసరమైన భూసేకరణలో భాగంగా శనివారం మధ్యాహ్నం కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెం రైతుల అభిప్రాయాలను అధికారులు సేకరించారు. జేసీ వేంకటేశ్వర్లు, మారిటైంబోర్డు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణ, కావలి తహసీల్దార్ పీ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. రైతుల అభిప్రాయాలను జేసీ అడిగి తెలుసుకున్నారు. రైతుల అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని జేసీ తెలిపారు.

రేషన్ మాఫియాపై ఉక్కుపాదం

ఇక నిరంతర తనిఖీలు.. అక్రమార్కులను వదిలిపెట్టం

ఆంధ్రజ్యోతితో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు



'పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు దొడ్డిదారిన తరలిస్తున్నారు. అలాంటి మాఫియాపై ఉక్కుపాదం మోపుతాం.' అని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల జేసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

? రేషన్ బియ్యం అక్రమ తరలింపును గుర్తించారా

! నెల్లూరు నగరంలో ఇటీవల ఐదు లారీల బియ్యం అక్రమ తరలింపు వ్యవహారం వెలుగుచూసింది. ఇలా ఎందుకు జరుగుతుందో కూలంకషంగా పరిశీలిస్తాం. ఎక్కడ నుంచి ఈ వ్యవహారం నడుస్తుందో తెలుసుకుంటాం.

? అక్రమార్కులపై చర్యలు ఎలా ఉంటాయి

! పేదల కోసం రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. డీలర్లయినా, ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచైనా బియ్యం అక్రమ తరలింపు జరిగిందని నిర్ధారణ అయితే చర్యలు తీవ్రంగా ఉంటాయి. అక్రమార్కులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

? పీజీఆర్ఎస్‌లో అర్జీల మాటేమిటి

! 2024 జూన్ 15న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం మొదలైంది. ఇప్పటిదాకా 52,438 అర్జీలు వచ్చాయి. వాటిలో 48,452 అర్జీలు పరిష్కరించగా, 3986 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 22022 ఫిర్యాదులు అందగా, 19,387 ఫిర్యాదులను పరిష్కరించారు. 2,635 పెండింగ్‌లో ఉన్నాయి.

? ఎడగారు సీజనులో సాగు విస్తీర్ణం ఎంత

! వ్యవసాయ శాఖ 98 వేల ఎకరాలలో సాగు జరుగుతుందని అంచనా వేసినా, 1.98 లక్షల ఎకరాల్లో వరి వేశారు. 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు లెక్క గట్టారు. జిల్లాలో ఎక్కువగా కేఎన్ఎం-1638 రకం వరిని 1.64 లక్షల ఎకరాల్లో వేశారు. ఆ తర్వాత ఎంటీయూ 1010, కేఎన్ఎం-733, ఆర్ఎన్ఆర్ 15048 రకాలను సాగుచేశారు.

? ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎన్ని

! జిల్లాలో ఎడగారు ధాన్యం సేకరణ కోసం 54 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. సంగం, సర్వేపల్లి, కావలి, కోవూరు, ఆత్మకూరు ప్రాంతాలలో పంట చేతికందింది. విక్రయానికి ధాన్యం సిద్ధంగా ఉండటంతో ఆ ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం.

? ఇప్పటిదాకా సేకరించినది

! 168 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాం. ఈ ధాన్యాన్ని సంగం మండలంలోని తరుణవాయి, మర్రిపాడుల నుంచి సేకరించాం.

? మద్దతు ధర మాటేమిటి

! ఎడగారులో పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. గ్రేడ్ -ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,369 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. పుట్టికి గ్రేడ్-ఏ రకానికి రూ.20,306.50, సాధారణ రకానికి పుట్టికి రూ. 20,136.50గా నిర్ణయించింది.

? ఎన్ని మిల్లులను ట్యాగ్ చేశారు

! ధాన్యం సేకరణకు సంబంధించి రైస్‌మిల్లర్లు రూ.32కోట్ల బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చారు. 59 మిల్లులను కొనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేశారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం మిల్లులకు సక్రమంగా వెళ్లడానికి, తీసుకున్న ధాన్యానికి సకాలంలో నగదు చెల్లించేందుకు వీలుకలుగుతుంది. రైతులకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం.

? భూముల రీసర్వే గురించి వివరించండి

! జిల్లాలో ఇప్పటివరకు రెండు విడతలలో భూముల రీసర్వే జరిగింది. మూడో విడత సర్వే ప్రారంభమైంది. ఈ విడతలో 34 గ్రామాలలో 89,368 ఎకరాలను రీసర్వే చేయిస్తాం. ఇందుకుగాను 76 బృందాలను ఏర్పాటు చేశాం. ఒక బృందం 25 ఎకరాలు చొప్పున సర్వే చేస్తుంది.

? డ్రోన్ సర్వే పూర్తయిందా

! మూడో విడత భూముల రీసర్వేకు సంబంధించి డ్రోన్ సర్వే త్వరలో చేపడతాం. భూముల రీసర్వేకు 43 రోవర్‌లు సిద్ధంగా ఉన్నాయి. మూడో విడత సర్వేలో ఎలాంటి సమస్యలు లేకుండా ఖచ్చితత్వంతో కూడిన సర్వే చేయిస్తాం.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)



పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ అజిత వేజెండ్ల

నేరాల కట్టడి పోలీసు బాధ్యత

● పోలీస్ అధికారులతో ఎస్పీ అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నేరాలను కట్టడి చేసి, ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు కల్పించి, ప్రశాంత వాతావరణం నెలకొల్పడం పోలీసుల బాధ్యత అని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పేర్కొన్నారు. జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యలు చేపట్టిన తర్వాత తొలిసారిగా శనివారం రాత్రి ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టేషన్‌ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు పెడింగ్ కేసుల పరిష్కారం, నేర నియంత్రణ చర్యలపై అధికారులకు దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, మత్తు, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, సింగిల్ నెంబర్లాట, పేకాట తదితరాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, పదేపదే నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు. కాగా సహజంగా క్రైం మీటింగ్ అంటే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, లేదా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నిర్వహించడం సహజం. అయితే మొదటిసారి సాయంత్రం నుంచి రాత్రి వరకు నిర్వహించడంపై జిల్లాలోని పోలీసు అధికారుల్లో చర్చనీయాంశం అయ్యింది. సాయంత్రం పోలీసు స్టేషన్లకు అధిక సంఖ్యలో బాధితులు తమ కేసుల విషయంలో వచ్చి ఎదురు చూడటం సహజమే. ఈ క్రమంలో శనివారం రాత్రి స్టేషన్ అధికారులు స్టేషన్‌లలో లేకుండా బయట ఉన్నారని సిబ్బంది చెప్పిన మాటలు ప్రజలకు అసహనం కల్పించాయని చర్చ సాగింది.

కావలి
కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270
కోడిగుడ్ల ధర (100): 520	

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.11,273
వెండి కిలో ధర	రూ. 1,51,500
వెండి ఒక గ్రాము	రూ.155.50

కోదండ రాముడికి ప్రత్యేక పూజలు

కావలి రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చౌదరిపాలెం కోదండరామస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. కోదండరామస్వామికి మంగళహారతి మొదలైన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం ఉదయం యాగశాల ప్రవేశం, కుంభస్థాపన, శ్రీరామ మూలమంత్ర హోమం, మంగళస్నానం, సాయంత్రం పంచసూక్తహోమం, సామూహిక లక్ష తులసి దళార్చన, మంగళహారతి తదితర పూజలు నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కందుకూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): 167బీ జాతీయ రహదారిపై మండలంలోని పలుకూరు సమీపంలో రవి గార్డెన్స్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పొదిలి భార్గవనాథ్ (25) అనే యువకుడు దుర్మరణం చెందాడు. భార్గవ్‌నాథ్ మోటారుసైకిల్‌పై కందుకూరు నుంచి ఒంగోలు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న నాన్‌స్టాప్ ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. భార్గవ్‌నాథ్ కొరియర్ బాయ్‌గా కందుకూరులో విధులు పూర్తిచేసుకుని తిరిగి ఒంగోలు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఆర్టీసీ డ్రైవరు పరారీలో ఉన్నాడు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే రూరల్ ఎస్‌ఐ మహేంద్రనాయక్ ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కొండాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీ బీసీ కాలనీలో దసరా రోజు బండారు సుధాకర్‌ను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మృతుడి బంధువులు, గ్రామస్థులు శనివారం డిమాండ్ చేశారు. హంతకులను అదుపులోకి తీసుకునేంతవరకు మృతదేహానికి అంత్యక్రియలు జరగనివ్వబోమని మృతుడి సోదరులు బండారు ప్రసాద్, రమేష్, శ్రీనివాసులు, కొండయ్య, మల్లె చిన్నయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి భార్య మల్లేశ్వరి అక్రమసంబంధం పెట్టుకున్న సొనంగుల రవి, మల్లేశ్వరి అన్న తురకా మాధవ, భార్య సునీత, లక్ష్మీకాంతమ్మ, మల్లె వేణు మరికొంత మందితో కలసి సుధాకర్‌ను చంపి ఉరి వేశారన్నారు. ఎస్‌ఐ మాల్యాద్రి న్యాయం చేస్తామని చెప్పడంతో నిరసన విరమించి, సుధాకర్ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు.

ఆటోడ్రైవర్ల జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రబాబు : ఇంటూరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆటోడ్రైవర్ల సేవలో అనే నూతన సంక్షేమ కార్యక్రమాన్ని ప్రకటించి ఆటో డ్రైవర్లందరికీ రూ. 15వేలు చొప్పున ఆర్థికసహాయాన్ని రాష్ట్రప్రభుత్వం వారి ఖాతాలలో జమ చేసిన సందర్భంగా శనివారం కందుకూరులో విజయోత్సవ నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆటోలన్నీ స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడి నుంచి ఏఎంసీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే స్వయంగా ఆటోడ్రైవరు యూనిఫాం వేసుకుని ఆటో నడుపుతూ సందడిచేశారు. అనంతరం మార్కెట్‌యార్డు ఆవరణలో సభ నిర్వహించి చంద్రబాబునాయుడు ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం ఆటోడ్రైవర్లను ఉద్దేశించి ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా నూతన పథకాలను సీఎం చంద్రబాబునాయుడు ప్రవేశపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే. అనూష, ఆర్డీవో టీవీఎస్ లక్ష్మి, తహసీల్దార్ లావణ్య, ఎంపీడీవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, శంకర్రావు, సురేష్, ఓబులేషు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమెట్ల గురునాథం తదితరులు పాల్గొన్నారు.

విలేకరి స్థలం ఆక్రమణ దారుణం : సీపీఐ

కందుకూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోవూరు రోడ్డులో ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాలలో సీనియర్ జర్నలిస్టు కె హరిబాబు స్థలాన్ని దురాక్రమణ చేయటం దారుణం అని సీపీఐ జాతీయ నాయకులు రావుల వెంకయ్య అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ దురాక్రమణ జరిగిన స్థలాన్ని పరిశీలించటం జరిగిందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాలకే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటన్న ఆందోళన కలుగుతోందని విమర్శించారు. సమావేశంలో సీపీఐ నాయకులు బి.సురేష్‌బాబు, ఆనంద్‌మోహన్, మురళి, నరసయ్య, దుర్గాప్రసాద్, మాధవరావు, మురళి, లక్ష్మీనారాయణ, బాలబ్రహ్మచారి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బిజిల్ యాప్ ద్వారా ఇంటి వద్దకే అన్ని సేవలు

కావలి, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ఇంటి వద్దకే అన్ని సేవలు అందేలా బండి అమర్ రెడ్డి రూపొందించిన బిజిల్ యాప్‌ను శనివారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. కావలి ప్రజలు టెక్నాలజీని సద్వినియోగం చేసుకునే విధంగా యాప్‌ను రూపొందించారన్నారు. ఈ యాప్ ద్వారా ఆహార పదార్థాలు, గృహోపకరణాలు.. ఇలా అన్ని రకాల సేవలు ఇళ్ల వద్దకే వచ్చి అందిస్తారని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

'పోషణ్' మాసోత్సవాలు

కలిగిరి, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): 'పోషణ్' మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని నాగసముద్రం, చినలన్నలూరు సచివాలయ పరిధిలోని తూర్పుమాలపాలెం అంగన్‌వాడీ కేంద్రాలలో ఆరోగ్యరక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

వేరుశనగ నూతన వంగడంతో అధిక దిగుబడులు

ఉలవపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ నూతన వంగడం టీఏజీ-73 రకంతో అధిక దిగుబడి సాధించవచ్చని కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాద్‌బాబు తెలిపారు. కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం గ్రామంలో శనివారం వేరుశన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ జ్యోతి, మాయాంక్, వివేక్, ఆర్ఎస్‌కే సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

దేవకికి ఘన సన్మానం

కందుకూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు మెంబర్‌గా నియమితులైన ఆల్ ఇండియా వాసవీసత్ర సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లును కందుకూరు ఆర్యవైశ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. మండల ఆర్యవైశ్యసంఘం కన్వీనర్ మురారిశెట్టి సుధీర్‌కుమార్, చక్కా కేశవరావు, కాకుమాని ప్రవీణ్‌కుమార్, రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు, గుర్రం చినఅల్లూరయ్య, మానేపల్లి బుచ్చయ్య, సిరి షాపింగ్‌మాల్ శివ తదితరులు దేవకి వెంకటేశ్వర్లు నివాసానికి వెళ్లి ఆయనకు అభినందనలు తెలిపి సత్కరించారు.

క్యాడెట్ మహిల్‌కు సత్కారం

కావలి (టౌన్) అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంటకరావునగర్‌లోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి 10 ఆంధ్ర నావెల్ యూనిట్‌కు చెందిన బండి మహిల్ అభినందనలందుకున్నారు. పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, నావెల్ యూనిట్ ఏఎన్ఓ థార్డ్ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి, ఉపాధ్యాయులు మహిల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిల్ కుని, ఉత్తమ క్యాడెట్ అవార్డు అందుకోవడం జిల్లాకే గర్వకారణమన్నారు. కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్‌గోదాం ప్రోత్సాహంతో ఎంపికయ్యాడని చెప్పారు.

ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండగా ఉంటుంది


ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే దగుమాటి, వెనుక కూర్చున్న ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్

కావలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం తగిన చేయూతను అందిస్తోందని, కావలిలో వారికి ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకంలో భాగంగా శనివారం పట్టణంలో ఆటో డ్రైవర్లు సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఆటోలతో సంఘీబావ ర్యాలీ నిర్వహించారు. ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై ట్రంకు రోడ్డు మీదుగా మద్దూరుపాడులోని ఎస్ఎంకే కన్వెన్షన్ హాలు వరకు సాగింది. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆటో కార్మికుని చొక్కా ధరించి ఆటో డ్రైవర్లతో మమేకమయ్యారు. ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌ను ఆటోలో ఎక్కించుకుని ఎమ్మెల్యే స్వయంగా ఆటో నడిపడం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఎస్ఎంకే కన్వెన్షన్ హాలులో ఆటో డ్రైవర్లు, టీడీపీ నేతలతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఎం. సన్నీవంశీక్రిష్ణ, డీఎస్పీ పీ. శ్రీధర్, ఆర్డీవో మురళీధర్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ పీ. శ్రావణ్‌కుమార్, కావలి, బోగోలు ఎంపీడీవోలు శ్రీదేవి, సుబ్రహ్మణ్యం, సీఐలు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా ఉప్పుటూరి సుబ్బలక్ష్మి

కావలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆశీస్సులతో శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా కావలికి చెందిన రాష్ట్ర బీసీ సెల్ అధికారప్రతినిధి, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకుడు ఉపుటూరు బాలగురుస్వామి సతీమణి సుబ్బలక్ష్మిని నియమించారు. దీంతో శనివారం సాయంత్రం ఆమె ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెను అభినందించారు. కార్యక్రమంలో ఉపుటూరి బాలగురుస్వామి, పెనుబాపల వెంకటేశ్వర్లు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల ధర్నా

కావలి (టౌన్) అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం ట్రంక్ రోడ్డులోని ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ మధుసూధన్‌రావు మాట్లాడుతూ ఈనెల 7న ఛలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు పువ్వాడి వెంకటేశ్వర్లు, మణిసుబ్బు, మాధవరావు, ఐఎచ్ఎల్ ప్రసాద్, సుదర్శనం, లక్ష్మయ్య, చిరంజీవి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ 2.0పై అవగాహన కలిగి ఉండాలి

కావలి (టౌన్) అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0పై శనివారం స్థానిక జీఎస్టీ కార్యాలయంలో వ్యాపార ప్రముఖులతో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ (ఎఫ్ఏసీ) వరప్రసాద్‌రావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సూపర్ జీఎస్టీ 2.0పై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నూతన జీఎస్టీ విధి విధానాలు, అమలు తీరుపై వ్యాపారస్తులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జీఎస్టీ గ్రీవెన్స్ బోర్డు సభ్యులు అమరా సుబ్బారావు, వ్యాపార ప్రముఖులు మద్దుల నరసింహారావు, బచ్చు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కున్న ఘనత వైసీపీదే

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి


ఉదయగిరి: ఆటోవాలాలకు చెక్కు అందజేస్తున్న కోటంరెడ్డి, కంభం, కూటమి నాయకులు, అధికారులు


ఆత్మకూరు : సభలో మాట్లాడుతున్న ఆర్డీవో బి పావని

ఉదయగిరి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలకు ఒక చేత్తో రూ.10 వేలు ఇచ్చి.. జరిమానాల రూపంలో మరో చేత్తో రెట్టింపు వసూలు చేసిన ఘనత గత వైసీపీ ప్రభుత్వానిదేనని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆటోడ్రైవర్ సేవలో కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, నియోజకవర్గ టీడీపీ నాయకులు, ఆటోవాలాలతో కలిసి ఉదయగిరి పట్టణంలోని గండిపాళెం సర్కిల్ నుంచి పట్టణ పురవీధుల గుండా కోటంరెడ్డి ఆటో నడుపుతూ టీటీడీ కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో 1,406 మంది ఆటో డ్రైవర్లకు రూ.2.10 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. తొలుత ఆటో యూనియన్ నాయకులను సన్మానించి అనంతరం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ కార్యదర్శి మాలేపాటి చైతన్య, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, కూటమి నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, గడ్డం వెంకటేశ్వర్లు, మట్ల శాంతి, నల్లిపోగు రాజా, నరసింహా, కొట్టే వెంకటేశ్వర్లు, కదిరి రంగారావు, ఎల్‌సీ రమణారెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, చంద్ర మధు, కలివెల జ్యోతి, సర్ఫుద్దీన్, శివకృష్ణ, అన్ని మండలాల టీడీపీ కన్వీనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రవాణా శాఖాధికారులు, ఆటోవాలాలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఆర్డీవో

ఆత్మకూరు : ఆటో డ్రైవర్ల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వాహన మిత్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఆత్మకూరు ఆర్డీవో బి పావని తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద అర్హులైన ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ. 15వేలు ఆర్థిక సహాయం అందుతున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 1636 మంది లబ్ధిదారులను ఎంపికచేసి వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, బిజెపి సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ కేశవచౌదరి తదితరులు మాట్లాడుతూ అర్హులై ఉండి పథకం అందకపోతే ఫిర్యాదుల స్వీకరణకు ప్రభుత్వం వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం కింద ఆర్థి చేయూతనందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు నమూన చెక్కును అందజేశారు. ముందుగా స్థానిక నెల్లూరుపాళెం సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఆటోలతో డ్రైవర్లు, టీడీపీ, బిజెపి, జనసేన నేతలు, కార్యకర్తలు, అధికారులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ సీనియర్ నేతలు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, వల్లూరు వెంకటరమణారెడ్డి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, సుంకర పెంచల చౌదరి, దావా పెంచలరావు, చండ్రా వెంకటసుబ్బానాయుడు, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, మర్రిపాడు మండలాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు, అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

సంగం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్డీయే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర చేనేత కార్మిక సంఘం నాయకులు పేర్కొన్నారు. సమస్యల అధ్యయనంలో భాగంగా శనివారం జిల్లాకు వచ్చిన వారు సంగంలో పర్యటించారు. చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలపై గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దశరథరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పముజుల హరి, చేనేత నాయకులు ఆకురాతి లక్ష్మీకాంతం, రిటైర్డ్ ఎమ్మార్వో సానం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

7న రాష్ట్రస్థాయి ధర్నాను విజయవంతం చేయండి


ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు, బాధ్యులు

ఆత్మకూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈనెల 7న విజయవాడలో జరిగే రాషస్థాయి ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏ సురేంద్రరెడ్డి, ఎస్ భాస్కర్‌రెడ్డి, ఎం గంగాధర్ పిలుపునిచ్చారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి వద్ద ఫ్యాప్టో సభ్యసంఘాల బాధ్యులు ధర్నా పోస్టర్‌లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో బాధ్యులు బి శివప్రసాద్, ఆర్ వెంకటేశ్వర్లురెడ్డి, జె కొండయ్య,ఐ చంద్రమోహన్‌రెడ్డి, ఎస్ శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ


గాంధీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి

సంగం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన 2026-27 ఏడాదికి సంబంధించి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై శనివారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామసభకు ముందు గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గత సంవత్సరం ఉపాధి హామి పథకంలో చేపట్టిన పనుల గురించి, ప్రస్తుతం జరిగే పనుల గురించి వివరించారు. అనంతరం ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్ర మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ ఫేస్ యాప్‌ల గురించి ఉపాధి హామి శ్రామికులకు వివరించారు. పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ నరేష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సర్పంచు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి ఆనం


సర్పంచు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి ఆనం

అనంతసాగరం అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డిపాడు సర్పంచు బుట్టి భారతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆ కుటుంబాన్ని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం సాయంత్రం పరామర్శించారు. సర్పంచు భారతమ్మ మృతికి సంతాపం తెలిపారు.

దేవిశెట్టిని పరామర్శించిన నుడా చైర్మన్

వింజమూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వింజమూరులోని ప్రధాన రహదారిలో నివాసముంటున్న బాలకృష్ణ వీరాభిమాని దేవిశెట్టి కృష్ణ, పెరుమాళ్లు ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న బాలకృష్ణ సేవా సమితి జిల్లా అధ్యక్షులు, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి శనివారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాలేపాటి చైతన్య, బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు షేక్ షరీఫ్, సొసైటీ డైరెక్టర్ గని శ్రీనివాసులునాయుడు, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి ఎల్‌సి రమణారెడ్డి, కటకం ప్రసన్నకుమార్, రవి, బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌లో యువతకు ఉచిత శిక్షణ

ఉదయగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యాక్ శిక్షణా కేంద్రంలో పీఎం అజయ్ పథకం కింద ఎస్సీ నిరుద్యోగ యువతీ, యువకులకు డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్రం నిర్వాహకులు లక్కినేని ప్రకాష్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండు నెలలపాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి 17 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచిత స్టేషనరీ, దూరప్రాంతం నుంచి వచ్చే వారికి ఉచిత వసతి కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9177327797 అనే సంప్రదించాలని ఆయన కోరారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

సీతారామపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, ప్రవీణా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, కొండయ్య, వెంకటసుబ్బయ్య, సీఆర్పీలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లలితా రుద్ర మహాయజ్ఞం

సంగం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమనకొండలో ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో లోక కల్యాణార్థం చేపట్టిన లలితా రుద్ర మహాయజ్ఞం శనివారం 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యజ్ఞంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.